



# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :20 సంచిక: 5 హైదరాబాద్ అక్టోబరు 2020 పేజీలు 40

Please visit : www.srimeherbaba.com వార్షిక సభ్యత్వం : రూ.100/-

# జూబ్లి కేంద్ర 34వ వార్షికోత్సవం

**2020 నవంబరు 15, ఉ. 9 నుండి 1 వరకూ సహవాస్ ఆన్‌లైన్లో**

**కోవిడ్ నిబంధనలు పాటిస్తూ క్యూలో అవతారుని దర్శనం**

అవతార్ మెహెర్‌బాబా జూబ్లి కేంద్ర వార్షికోత్సవం 2020 నవంబరు 15, ఆదివారం ఉదయం 9 నుండి 1 గంట వరకూ ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శ్రీ రాజేంద్రమెహెర్ తెలిపారు. ఐతే, కోవిడ్ 19 నిబంధనలు పాటిస్తూ జూబ్లిహిల్సు బాబా కేంద్రం బాబా ప్రేమికుల కోసం తెరిచి వుంటుందని అన్నారు. ఐతే, ప్రేమికులు బాబా దర్శనం చేసుకుని వెనుతిరగాలని, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాల వంటి ఏర్పాట్లు ఏమీ లేవన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వర్చ్యువల్ సహవాస్ కార్యక్రమాన్ని ఎవరి ఇళ్ళలో వారుండి వీక్షించే ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

# మెహెర్‌బాబా పత్రిక

మెహెర్ నామం ఎక్కువమంది పాఠకులకు అందజేసేందుకు వీలుగా మీ బంధు మిత్రులలో కనీసం ఒకరిద్దరినైనా ప్రోత్సహించి పత్రికకు వార్షిక, జీవిత సభ్యులుగా చేర్పించండి. మీ ఇ-మెయిల్ అడ్రస్ పంపితే పత్రికను ఇంటర్‌నెట్‌లో పంపగలం. పత్రిక పది వేల సైన్యంతో సమానమని గమనించగలరు. మరిన్ని వివరాలను ప్రతి సంచికలోని పేజి 40 లోగా సవివరంగా తెలియజేయడమైంది లేదా మొబైల్ 99595-53218 సంప్రదించగలరు. మెహెర్‌బాబా పత్రికను ప్రతినెలా ఠంచనుగా 26వ తేదీన పోస్ట్ చేస్తున్నాం. అంతకంటే ముందుగా అంటే ప్రతినెలా 20వ తేదీ కల్లా పత్రికను సిద్ధం చేసి ప్రింటింగ్ కోసం పంపుతూ, మెహెర్‌బాబా పత్రిక పేరిట ప్రారంభించిన వాట్సప్ గ్రూప్‌లో, అలాగే ఇ-మెయిల్ ద్వారా పోస్ట్ చేస్తున్నాం. ప్రింటింగ్ పూర్తయ్యాక సభ్యులందరికి ప్రతినెలా 26 తేదీన పోస్టు చేస్తున్నాం. పత్రిక మీ ఇంటికి 28వ తేదీలోగా తప్పక బట్వాడా అవుతుంది. మీ అడ్రస్సులో మార్పులుంటే తక్షణం మొబైల్ ఫోన్ నంబరు 99595 53218 యస్‌యంయస్ లేదా వాట్సప్ ద్వారా గానీ తెలియజేయవల్సింది.

**మెహెర్‌బాబా పత్రికను ఆన్‌లైన్‌లో సందర్శించండి!!**

**www.srimeherbaba.com**

## బాబా సందేశం

**God alone is Real, all else is illusion.**

ఒక్క పరమాత్మ మాత్రమే సత్యం మిగిలినదంతా మిధ్య

- మెహెర్‌బాబా

గౌరవ సంపాదకులు
మల్లాది కృష్ణానంద్
**99595-53218,**
**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 10వ తేదీ లోపల అందేలా పంపవలసింది.**

## లోపలి పేజీలలో...

1. సంపాదకీయం 5
2. ఫిలిస్ ఫ్రెడ్రిక్ 6-10
3. సప్త వాస్తవములు 11-12
4. చించోర్‌కర్ 14-15
5. మనోనాశ్ సమావేశం 16-19
6. లార్డ్ మెహెర్ 20-29
7. లఘు నాటిక 30-34
8. తెలుగు-గుజరాతీ సహవాస్ 35-38
10. పశ్చాత్తాప ప్రార్థన 39

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

## మనవి

**ఈ ప్రచురణలోని రచనలు, అందలి భావాలు సంబంధిత రచయితలవేనని పాఠకులు గమనించగలరు.**

Please visit : www.srimeherbaba.com

# 52వ అమరతిథి

## 2021 జనవరి 30, 31 వర్చ్యువల్ సహవాస్

కోవిడ్ 19 వైరస్ ఇంకా నియంత్రణలోనికి రాని కారణంగా 2021 జనవరి 30, 31 తేదీలలో మెహెరాబాద్ నుండి అవతారుని 52వ అమరతిథి వేడుకలు ఆన్‌లైన్‌లో ఏర్పాటు చేసినట్లు బాబా ట్రస్టు చైర్మన్ శ్రీ శ్రీధర్ కేల్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అమరతిథి రోజుల్లో సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనగోరువారు తమ వివరాలను ట్రస్టువారికి అందేలా 2020 డిశెంబరు 10 లోగా అందేలాగా పంపవలెనన్నారు. మరిన్ని వివరాలకు అవతార్ మెహెర్‌బాబా ట్రస్టు వెబ్‌సైట్‌ను దర్శించగలరు. లేదా, **amartithihelpdesk@gmail.com** / 74477-66580 / 74477-66585, సంప్రదించవల్సింది. ముఖ్యంగా,

**2021 జనవరి 31న మధ్యాహ్నం 12 నుండి 12.15 వరకూ**
బాబా ప్రేమికులందరూ వారి వీలునిబట్టి, ఆ సమయంలో వారెక్కడున్నా అవతారుని నామస్మరణతో మౌనం పాటించవల్సిందిగా మనవి చేశారు.
**"ప్రియతమ మెహెర్‌బాబా ఎప్పుడూ మీతో వుంటాడని, ఆయన నుండి మీరు ఎన్నడూ వేరు కాదని ప్రవచించిన అవతారుని మాటలను", ట్రస్టు చైర్మన్ మరోమారు బాబా ప్రేమికులకు గుర్తుచేశారు.**

# మనోనాశ్ 69వ వార్షికోత్సవం

హైదరాబాద్‌లోని ఖాజాగూడా గూహ సమీపంలో అవతారుడు నిర్వహించిన మనోనాశ్ కార్యక్రమ 69వ వార్షికోత్సవాన్ని 2020 అక్టోబరు 18, ఆదివారం ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఐతే, ఉదయం 9 నుండి 1 గంట వరకూ మనోనాశ్ గుహను బాబా ప్రేమికుల దర్శనార్థం తెరచి వుంచారు. పలువురు స్థానిక ప్రేమికులు మనోనాశ్ గుహలో అవతారుడ్ని దర్శించుకున్నారు. మనోనాశ్ వార్షికోత్సవాన్ని ప్రతిఏటా పెద్దఎత్తున సహవాస్ నిర్వహించేవారు. కొన్ని వందల మంది బాబా ప్రేమికులు హైదరాబాద్ చుట్టుప్రక్కల గల అనేక బాబా కేంద్రాల నుండి కూడా విచ్చేసేవారు. కోవిడ్ 19 కారణంగా ఈ ఏడాది సహవాస్ కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లో నిర్వహించడమైంది.
హైదరాబాద్‌లోని ఖాజాగూడ గుహలో మెహెర్‌బాబా 1951 అక్టోబరు 15 నుండి 24 వరకూ ఏకాంతవాసం, మనోనాశ్ కార్యక్రమం చేశారని పాఠకులకు తెలుసు. 1951 అక్టోబరు 16 నాటికి బాబా నవజీవన కార్యక్రమం చేపట్టి రెండేళ్ళు నిండాయి.

## సంపాదకీయం

# అభిలాష

"హైదరాబాద్ అంటే నాకెంతో ఇష్టం అన్నారు మెహెర్‌బాబా. హైదరాబాద్ ఒక గొప్ప ఆధ్యాత్మిక ఆలవాలం అన్నారు. పలుసందర్భాలలో మెహెర్‌బాబా హైదరాబాద్‌ను తొమ్మిదిసార్లు పర్యటించారు. మొత్తం 360 రోజులు అంటే రమారమిన ఒక ఏడాది కాలం హైదరాబాద్‌లో బాబా బస చేశారని సమాచార భోగట్టా. మస్తుల అన్వేషణలో భాగంగా మెహెర్‌బాబా హైదరాబాద్‌కు ప్రత్యేకంగా 7సార్లు వచ్చారు. అన్నింటికంటే ముఖ్యంగా 1951 మే 27 నుండి అక్టోబరు 24 వరకూ మొత్తం 151 రోజులు మెహెర్‌బాబా హైదరాబాద్‌లోని జూబ్లిహిల్సులో బస చేశారు. ఆ మరుసటి నెలలో అంటే 1951 జూన్ 28,29,30 తేదీలలో హైదరాబాద్‌లో బాబా ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మన దేశంలోని పలు ప్రాంతాల నుండి 70 మందికి పైగా ప్రేమికులు ఆ సమావేశానికి హాజరయ్యారు. జూన్ 28న ప్రారంభమైన తొలిరోజు సమావేశంలో అవతారుడు తాను 1951 అక్టోబరు 15 నుండి చేపట్టబోయే మనోనాశ్ కార్యక్రమంపై పెద్దఎత్తున వివరించారు. ఈ సమావేశం ఏకబిగిన 4 గంటలు కొనసాగిందని ఆనాటి ప్రేమికుల రచనలు తెలియజేస్తున్నాయి. ఆనంతరం, 1951 అక్టోబరు 15 నుండి 24 వరకు ఖోజాగూడా కొండపైన మెహెర్‌బాబా మనోనాశ్ కార్యక్రమాన్ని 10 రోజుల పాటు నిర్వహించారు. 'మనోనాశ్' కార్యక్రమం అంటే మనస్సు నశింపజేయడమేనని అర్థం చెప్పుకోవాలి. ఈ కార్యక్రమం ముగిశాక, 1951 అక్టోబరు 24న మధ్యాహ్నం హైదరాబాద్ నుండి ఔరంగాబాద్ – ఇమాంపూర్‌ల మీదుగా కాలినడకన నెల రోజుల తర్వాత బాబా మెహెరాజాద్‌కు చేరుకున్నారు. ఇలా అవతారుని పాదస్పర్శతో పునీతమైన హైదరాబాద్, మనోనాశ్ గుహ ప్రాంగణం అంతర్జాతీయ ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఎలాంటి హంగులు ఆర్భాటాలు లేని ఈ పవిత్ర నిరాడంబర ప్రాంగణం ఆధ్యాత్మిక జిజ్ఞాసువులందరికీ ఓ పవిత్ర యాత్రా కేంద్రం. 2020 అక్టోబరు 16 నాటికి అవతారుడు ఈ ప్రాంతంలో అడుగిడి 69 సంవత్సరాలు నిండాయి. ఐతే, కరోనా ప్రభావంతో ఈ ఏడాది ఆన్‌లైన్ వార్షికోత్సవ సహవాస్ కార్యక్రమం నిర్వహించారు. ఏదిఏమైనా, మన దేశంలోని బాబా ప్రేమికులు, అలాగే, యూరోపు, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, తదితర దేశాలలోని ప్రేమికులు అందరికీ మనోనాశ్ గుహ ఆధ్యాత్మిక విశిష్టత గురించి ఇంకా విస్తృతంగా తెలియజేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది. అన్నీ అనుకూలిస్తే 2021 అక్టోబరులో మనోనాశ్ 70వ వార్షికోత్సవాన్ని అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాటు చేయాలనుకోవడం అభిలషనీయం!!

*

## ఎడిటర్, అవేకనర్ ఆంగ్ల త్రైమాస పత్రిక

# ఫిలిస్ ఫ్రెడ్రిక్

**1915 - 1987**



ఫిలిస్ ఫ్రెడ్రిక్, లాస్‌ఏంజల్స్, అమెరికా, గొప్ప పత్రికా సంపాదకురాలు. ఆమె తన చిన్నతనంలోనే కలంపట్టి కవితలు రాసింది. అనేక పత్రికలకు వివిధ హోదాలలో పనిచేశారామె. పలు అడ్వర్టైజ్‌మెంట్ సంస్థలకు కాపీరైటర్‌గా పనిచేశారు. 1952లో అమెరికాలోని మెర్టిల్‌బీచ్ బాబా కేంద్ర ప్రారంభోత్సవ సందర్భంగా విచ్చేసిన మెహెర్‌బాబాను ఫిలిస్, ఆమె భర్త ఇద్దరూ తొలిసారిగా దర్శించుకున్నారు. ఆ పిదప, బాబా మెర్టిల్‌బీచ్‌లో వున్న సమయంలోనే బాబా ప్రేమికుల కోసం ఒక ప్రత్యేక పత్రిక నిర్వహించేందుకు అనుమతి తీసుకుని, "అవేకనర్" పేరిట త్రైమాసిక ఆంగ్ల పత్రికను ప్రారంభించారు. 1953 జూలైలో తొలి పత్రికను విడుదల చేశారు. ఆనాటి నుండి సుమారు మూడున్నర దశాబ్దాలకు పైగా ఈ పత్రిక వందలాది పాఠకుల ఆదరణను చవిచూసింది. పత్రిక నిర్వహణకు అవసరమైన ఎన్నో సలహాలు, సూచనలు బాబా చేశారు. ఈ సందర్భంగా పత్రికలో అడ్వర్టైజ్‌మెంట్లను ప్రచురించవద్దని బాబా ఆదేశించారు. సంవత్సరంలో నాలుగు పత్రికలు చొప్పున ప్రతి మూడు మాసాలకు ఒక సంచిక చొప్పున రమారమిన 67 సంచికలను 1986 నవంబరు వరకూ ప్రచురించారు. అవతారుడు స్వయంగా అనుమతించిన తొలి అమెరికన్ ఆంగ్ల పత్రికగా అవేకనర్ గణుతికెక్కింది. ప్రతి సంచికలో విశేషరీతిలో అరుదైన సమాచారాన్ని చక్కని పత్రికా భాషలో అందజేసిన శ్రీమతి ఫిలిస్ అనారోగ్య కారణాల వల్ల 1986 నవంబరు 1న, సంపుటి 22, సంచిక 1తో పత్రికను నిలిపివేశారు. ఈ పత్రికలోని ప్రతి అక్షరం నేటికీ అజరామరంగా నిలుస్తోంది. ఈ సందర్భంగా ఆనాటి మేటి పత్రికా సంపాదకురాలు శ్రీమతి ఫిలిస్ ఫ్రెడ్రిక్ అవతారుని ప్రేమ - సేవలో తరించిన వైనం, ముఖ్యంగా ఈ తరం యువత

తప్పక తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో సంక్షిప్తంగా ఆమె గురించి, ఆమె మాటల్లోనే, తెలియజేసే ప్రయత్నం చేస్తున్నాం. దయచేసి గమనించండి.

****

మా తండ్రి జార్జి ఫ్రెడ్రిక్ గొప్ప రచయిత. పలు పత్రికలకు వ్యవస్థాపక సంపాదకుడు. తల్లి శ్రీమతి క్రిష్టి కూడా గొప్ప విద్యావంతురాలు. మహిళలకు ఆర్థిక స్వావలంబన అత్యవసరం అని గట్టిగా పోరాడిన ధీర వనిత. ఆమె కూడా బహు గ్రంథ రచయిత్రి. అలా విద్యావంతులు, సంస్కారవంతుల ఇంట్లో పెరగడం వల్లనో ఏమో, చాలా చిన్న వయస్సులోనే కలంపట్టి కవితలు రాశాను. అమెరికాలోని ప్రముఖ కార్నెల్ విశ్వవిద్యాలయంలో చదువు పూర్తయ్యాక పలు పత్రికలలో వివిధ హెూదాలలో పనిచేశాను. అనేక అడ్వర్టైజ్‌మెంట్ కంపెనీలకు కాపీరైటర్‌గా విశేష అనుభవం గడించాను. చివరిగా, మాట్టెల్ టాయ్ కంపెనీ, లాస్‌ఏంజల్స్ సంస్థలో సుమారు 15 సంవత్సరాలు పనిచేసి, 1975 ప్రాంతంలో పదవీవిరమణ చేసి లాస్‌ఏంజల్స్‌లోనే స్థిరపడ్డాను. 1941లో అడేల్ వోకిన్‌తో (Adele Wolkin) నా స్నేహం పరిణయానికి దారి తీసింది. ఆ రోజుల్లో మా ఇద్దరికీ ఆధ్యాత్మికత గురించి ఏమి తెలియదు. ఐనప్పటికీ తరచు అనేక సాధుసజ్జనుల సత్సంగ్ కార్యక్రమాలకు వెడుతుండే వాళ్ళం. ఆ పిదప న్యూయార్క్‌లోని రామకృష్ణ మఠానికి వెళ్ళడం ప్రారంభించాం. ఆనాడు నిఖిలానంద స్వామి చెప్పే ఉపన్యాసాలు శ్రద్ధగా ఆలకించేవాళ్ళం. అలా ఒక రోజున రామకృష్ణ మఠానికి వెళ్ళిన నాకు ఓ మరిచిపోలేని సంఘటన జరిగింది. అదేమంటే, అక్కడ వేదికపై వున్న రామకృష్ణ పరమహంస పెద్ద చిత్రపటాన్ని నేను తదేకంగా చూస్తున్నాను. ఒక్క క్షణం నేను ఆశ్చర్యపోయేలా, ఆ ఫోటోలోని రామకృష్ణుడి ముఖం ఉన్నట్టుండి మాయమయింది. ఆ స్థానంలో ఒక గొప్ప కాంతిపుంజం కనిపించింది. ఓ నడివయస్సుగల ఓ స్ఫురద్రూపి తీయని గొంతుకతో "అతనే నీ జీసస్ క్రీస్తు" అని అనడం నా చెవులకు స్పష్టంగా వినిపించింది. దాంతో తల త్రిప్పి చూస్తును కదా పొడవాటి ఒత్తు జుత్తుతో, తెల్లని ధవళ వస్త్రాలతో, దేదీప్యమానమైన నక్షత్రాల్లాంటి కన్నులతో నాకేసి తదేకంగా చూస్తూ, చేతులు ఊపుతూ, నాతో ఏదో మాట్లాడాడు. ఆ మాటలు మరేవోకాదు "సెర్మన్ ఆన్ మౌంట్"లో జీసస్ చెప్పిన మొదటి పంక్తులని ఆ తర్వాత నాకర్థమయ్యింది. అలా తదేకంగా ఆతనికేసి నేనెంతసేపు చూసానో నాకు గుర్తులేదు. నేను కళ్ళు తెరిచేసరికి నిఖిలానందస్వామి ఓం శాంతి, శాంతి అంటూ తన ప్రసంగాన్ని ముగించారు. ఆ సమావేశానికి హాజరైన వారందరూ ఒక్కొక్కరే లేచి అక్కడ నుండి బయటకు బయల్దేరుతున్నారు. నేనూ అన్యమనస్కంగానే ఇంటికి చేరుకున్నాను. ఆ తర్వాత

రెండు మూడు వారాలకు నోరినా మ్యాచ్‌బెల్లి అనే వ్యక్తి మెహెర్‌బాబా గురించి స్థానిక హెూటల్‌లో ప్రసంగిస్తారని, ఆ సమావేశానికి తప్పక రమ్మనమని నాకొక వ్యక్తిగత ఆహ్వానం వచ్చింది. అప్పటిదాకా నేను ఎన్నడూ మెహెర్‌బాబా పేరు వినలేదు. ఆయన గురించి కూడా నాకేమీ తెలియదు. ఆ ఆహ్వానం నాకెలా వచ్చిందో నాకిప్పటికీ ఆశ్చర్యమే. ఏమైతేనేమి నేను నోరినా సమావేశానికి వెళ్ళాను. అక్కడ వేదికపై ఎక్కడా మెహెర్‌బాబా ఫోటో ఏమీ లేదు. నోరినా ప్రసంగంలో మెహెర్‌బాబా సందేశాల గురించి అనర్గళంగా ప్రసంగించింది. అమె చేసిన ప్రసంగం నన్నెంతగానో ఆకర్షించింది. ఆమెలో ఏదో శక్తి వుందనిపించింది. సమావేశం పూర్తయ్యాక నేను ఆమెను కలిశాను. నన్ను వాళ్ళింటికి రమ్మనమని పిలిచింది. అలావారింటికి వెళ్ళినప్పుడు, అక్కడ వారింట్లో గోడకు వున్న చిన్న బాబా ఫోటోను చూడగానే రామకృష్ణ మఠంలో నేను చూసిన నా జీసస్ కథనం గుర్తుకొచ్చింది. ఆ రోజుల్లో, నోరినాతోపాటు బాబా ప్రేమికులు కౌంటెస్‌నాడినే టాలిస్టాయ్, ఎలిజబెత్ ప్యాటర్‌సన్‌లు ముగ్గురూ న్యూయార్క్‌లో ఒకే ఇంట్లో వుండేవారు. ఆ మాదిరిగా ఆ రోజున ఆ ముగ్గురిని కలుసుకున్నాను. వారు 1941 దాకా అవతారుని సన్నిధిలో మెహెరాబాద్ తదితర ప్రాంతాలలో బాబాతోనే వున్నారు. ఆ తర్వాత, 1943లో అమెరికాలో బాబావారి సత్య ప్రేమ సందేశవ్యాప్తి కోసం బాబా వారిని వారి స్వదేశానికి పంపారు. ఆ ముగ్గురూ న్యూయార్క్ మహానగరంలో ఒక పెద్ద ఇంట్లో అద్దెకు వుండేవారు. బాబా గురించి నోరినా ప్రసంగాలు చేస్తుండేది. టాల్‌స్టాయ్ సమావేశాలకు విచ్చేసే ఆహుతుల్ని సాదరంగా ఆహ్వానించేది. అందుకైన జమా-ఖర్చులు ఎలిజబెత్ పాటర్‌సన్ చూసుకునేది. వారితో క్రమేపీ నాకు బలమైన స్నేహబంధం ఏర్పడింది. నేను వారికి చాలా సన్నిహితమయ్యాను. వారితో నా స్నేహం ఎంతగా ఎదిగిందంటే నన్ను కూడా వారి అపార్ట్‌మెంట్‌లోనే వుండమని ఆహ్వానించారు. అందుకు నేనూ వెంటనే అంగీకరించాను. 1944 - 1946 నడుమ నేను వారితో కలిసి వారి అపార్ట్‌మెంట్లోనే వున్నాను. బాబా నవజీవన కార్యక్రమం 1949లో చేపట్టడానికి ముందు, బాబా నోరినాను, ఎలిజబెత్ పాటర్‌సన్‌ని ఇండియా (మెహెరాజాద్)కి రమ్మనమని ఆదేశించారు. నాడినే టాలిస్టాయ్ అప్పటికే మరణించింది. నేను ఈ ముగ్గురికి ఎంతో రుణ పడివున్నానని చెప్పాలి. బాబా గురించి వీరి ద్వారా అనేక సంగతులు తెలిశాయి. అనేక ఆధ్యాత్మిక విషయాలను వారు నాకు చెప్పారు. అమెరికాలో వుండే మాకు ఆధ్యాత్మికత గురించి అనేక అపోహలున్నాయి. నా సందేహాలెన్నింటికో వీరు తగిన జవాబులిచ్చి నా మనస్సుని కుదుటపరచారు. దాంతో నేను పూర్తిగా బాబాకు అంకితమయ్యాను. ఆయన్ని

సాక్షాత్తూ ఈ యుగావతారునిగా నమ్మాను. నా ఏసు ప్రభువు నాకు దర్శనమిచ్చాడని భావించాను. ఆ తర్వాత నేను చాలాకాలం, దాదాపుగా 1943 నుండి ఓ దశాబ్దంపాటు బాబా భౌతిక దర్శనం కోసం ఎదురు చూశాను. అవతారుని నుండి ఉత్తరాలు, కేబుల్స్ ద్వారా పరిచయం, బాబా సందేశాలు ఎప్పటికప్పుడు అందుకున్నాను కానీ అవతారుని దర్శనం మాత్రం పొందలేకపోయాననే బాధ నాలో ఎంతగానో వుండేది. "నేను బాబా పరిధిలోకి వచ్చినందుకు చాలా సంతోషం" అంటూ బాబా నాకు తొలిసారిగా పంపిన లేఖ మరచిపోలేనిది. 1948లో నోరినా, ఎలిజెబెత్‌లు మెహెరాబాద్‌కి వెడుతూ, బాబాకి ఏమైనా చెప్పాలా? అని నన్ను అడిగారు. నేను ఏమీ ఆలోచించకుండా – నాక్కూడా మెహెరాబాద్‌కి రావాలని వుందని,అందుకు బాబా అనుమతి అడగమన్నాను. ఐతే నా చిన్ని కోరిక వాయిదా పడుతూ –పడుతూ చివరాఖరుగా 1962 పూణేలో జరిగిన ఈస్ట్–వెస్ట్ గాదరింగ్‌లో పాల్గొనేందుకు అనుమతి లభించింది.

## మెర్టిల్‌బీచ్ ప్రారంభం 1952లో

ఐతే, ఈలోగా ఎలిజెబెత్ పాటర్‌సన్ అమెరికాలోని మెర్టిల్‌బీచ్ ప్రాంతంలో అవతారుని కోసం తలపెట్టిన బాబా కేంద్ర నిర్మాణ సమయంలో చురుకుగా పాల్గొనే అవకాశం నాకు లభించింది. నాలాగా నోరినా తదితరుల ద్వారా బాబా గురించి తెలుసుకుని, బాబా రాక కోసం ఎదురుచూస్తున్నవారు అమెరికాలో చాలామందే వున్నారు. మేమందరం అవతారుడ్ని మనస్సులోనే దర్శించుకుంటూ, ఆయన దర్శనం కోసం ఎదురు చూస్తూ, స్థానికంగా జరుగుతున్న అనేక బాబా కార్యక్రమాలలో పాల్గొంటున్నాం. 1952లో బాబా మెర్టిల్‌బీచ్ కేంద్ర ప్రారంభోత్సవానికి వచ్చారు. ఆనాడు నేను, నా భర్త ఇద్దరం బాబాను దర్శించుకున్నాం. ఆనాడు బాబాను దర్శించుకున్నవారిలో మేమిద్దరం ముందు వరుసలో వున్నాం. బాబా మమ్మల్ని చూస్తూనే "నోరినా, ఎలిజెబెత్‌లు మీ గురించి చాలా చెప్పగా విన్నానన్నారు. బాబా ఎడల గల మా ప్రేమ తనకు తెలుసని బాబా అక్షరఫలకంపై రాశారు. మమ్మల్ని ఇద్దర్నీ చూస్తుంటే చాలా అనందంగా వుందన్నారు. తన గురించి తెలిస్తే ఓ చంటి పిల్లవాడిని ప్రేమించినట్లు ప్రేమిస్తారన్నారు. తనకు హాస్యం అంటే ఎంతో ఇష్టమన్నారు. మీరు బాబా ప్రేమిస్తున్నారా? అని బాబా తిరిగి మమ్మల్ని ప్రశ్నించారు. బాబా కోసం మేం ఏం చేయగలమని నా భర్త ఎడిలే బాబాని అడిగారు. "నాకు మీ ప్రేమ కావాలి? అంతకుమించి మరేం అవసరం లేదన్నారు బాబా. నన్ను ప్రేమించండి. భగవంతుడు మిమ్ముల్ని ప్రేమిస్తాడు. అదే నాకు కావల్సింది. భగవంతుడు ప్రేమించడమంటే, అక్కడ అన్నీ సమృద్ధిగా వున్నట్లే కదా!! అన్నారు. మీ ప్రేమ స్వచ్ఛంగా, నిజాయితీగా

వుండాలన్నారు.ప్రేమ తప్పు మిగిలినదంతా మిధ్య అన్నారు బాబా. మీరు కనుక నిజంగా నన్ను ప్రేమించవల్సిన రీతిలో ప్రేమిస్తే మీరిక నా కోసం ఏం చేయగల్గుతారని బాబా ప్రశ్నించారు. బాబావారి మాటలు మా హృదయాలను సూటిగా తాకాయి. ఆ పిదప మెర్టిల్‌బీచ్‌లో వుండగానే, నేను పత్రికా రంగంలో గత కొన్ని సంవత్సరాలుగా వున్నందువల్ల, బాబా సందేశవ్యాప్తికి అనువుగా ఒక పత్రికను ప్రారంభించేందుకు అనుమతించమని కోరాను. బాబా కొన్ని సూచనలతో అనుమతించారు. బాబా తాను బోధించుటకు రాలేదు. మేల్కొపుటకే వచ్చానన్నారు కదా!!. అందుకే నేను పత్రిక పేరును అవకేనర్‌గా నిర్ణయించి బాబా అనుమతి పొందాను. 1953 జూలైన తొలి సంచికతో అవేకనర్ ఆంగ్ల పత్రిక ఆ మాదిరిగా ప్రారంభమైందని ఫిలిస్ తన స్వగతం ముగించారు.

**అవే మాటలు**

**A Note from the Editor**

This issue, our Volume Twenty-One Number Two, is late and I apologize. Personal health reasons have delayed the work since I "do it all". I also would like to say, unless *The Awakener* gains more subscribers soon, it definitely will cease. I do appreciate your continuing enthusiasm and support, but it is impractical to continue to publish for a miniscule audience.

**•In His Love,**
***Filis Frederick***

## చివరి సంచిక

పత్రిక ప్రారంభం నుండి ప్రతి సంచికలో ఎన్నో ఆసక్తికర అరుదైన విషయాలతో పాఠకులను ఉర్రూతలాడించిన అవేకనర్ పత్రిక 1986 నవంబరు 1న, 22వ సంపుటి, సంచిక 1తో నిలిచిపోయింది. శ్రీమతి ఫిలిస్ ఫ్రెడ్రిక్ అనారోగ్యమే అందుకు ప్రధాన కారణం. ఆమె 1984 నుండి సుమారు 3 సంవత్సరాలు కేన్సర్‌తో పోరాటం చేసి, 1987 మార్చి 19న లాస్‌ఏంజల్స్‌లో బాబా నామస్మరణతో తుదిశ్వాసవిడిచారు. ఆ రోజున అందరూ గురుపూర్ణిమ పూజోత్సవం జరపుకుంటుంటే ఫిలిస్ తన గురువు, దైవమైన, అవతారుని ధ్యాసలో కోమాలోకి జారుకుంది, ఆ పిదప ఆమె తిరిగి మన స్పృహలోకి రాలేదు. తుదిశ్వాస వదిలారు.

****

అవతారునికి సంపూర్ణంగా అంకితమైన ధన్యురాలు శ్రీమతి ఫిలిస్ ఫ్రెడ్రిక్. ఆమెకు శరీరంలో శక్తి వున్నా, ఆరోగ్యం ఎలా వున్నా చివరి క్షణం వరకూ అవతారుని సేవలో పాల్గొని తరించిన గొప్ప ప్రేమికురాలని స్థానిక బాబా ప్రేమికులు కొనియాడతారు. శ్రీమతి ఫిలిస్ ఫ్రెడ్రిక్ ఈ తరం యువతకు ఆదర్శం కావాలి. *

మెహెర్‌బాబా ప్రవచనములు

# THE SEVEN REALITIES
# సప్త వాస్తవములు

శ్రీమతి ఎస్.ఎస్. లక్ష్మి, కాకినాడ

“నేను బోధించుటకు రాలేదు. మేల్కొల్పుటకే వచ్చాను” అని మెహెర్‌బాబా పలు సందర్భాలలో ప్రకటించారు. మానవ హృదయాలను మేల్కొల్పి అజ్ఞానం అనే చీకటిని పారద్రోలి జ్ఞాన దీపాన్ని వెలిగించేందుకు తాను వచ్చానని బాబా స్పష్టం చేశారు. 1941 జనవరి 9న రాజస్థాన్ రాష్ట్ర రాజధాని జైపూర్ పర్యటనలో వున్నారు. ఆ సమయంలో ఏడు వాస్తవాలు -**THE SEVEN REALITIES** పేరిట బాబా ఒక సందేశం ఇచ్చారు. ప్రతి వ్యక్తిలోను ఆధ్యాత్మికత అంతర్లీనంగా ఉంటుందని, ఏదోరకంగా ప్రతి ఒక్కరూ భగవంతుని ఆరాధిస్తుంటారని బాబా అన్నారు. ఎప్పుడో ఒకప్పుడు, ప్రతిఒక్కరూ భగవంతుని వైపుకు ఆకర్షింపబడతారు. అందుకోసం కొందరు దీక్షలు, యాగాలు, యజ్ఞాలు, పూజలు చేస్తారు. మరికొందరు దేవుడి గురించి ప్రవచనాలు చెబుతారు. అలా కొందరు భగవంతుడిని దీక్షగా ఆరాధిస్తూ కూడా ఏది సత్యం? ఏది అసత్యం? తెలియని డోలాయమానంలో వుంటారు. కొందరి మనస్సులో అనేక సందేహాలు వెంటాడుతుంటాయి. ఈ నేపథ్యంలోనే అందరూ తెలుసుకోవలసిన ఏడు వాస్తవాలను బాబా తన సందేశంలో ఇలా పేర్కొన్నారు.

### 1. అస్తిత్వము లేక ఉనికి: (Real Existence)

అందరిలో వున్న భగవంతుడు ఒక్కడే సత్యం. ఆ భగవంతుడే నిజమైన అస్తిత్వం కలవాడు.

### 2. ప్రేమ: (Real Love)

భగవంతునిపై గల ప్రేమయే “నిజమైన ప్రేమ”. భగవంతునిపై గల ఈ ప్రేమయే భగవంతుడిని చూడాలని, తెలుసుకోవాలని, భగవంతునిలో ఐక్యం కోసం పరితపిస్తారు.

### 3. త్యాగం:

భగవంతుడిని ప్రేమిస్తూ, ఆయన కోసం తమ సర్వస్వం సమర్పించడమే నిజమైన త్యాగం. ఇందుకు బాబా మండలి సభ్యులు ప్రత్యక్ష సాక్షులుగా నిలుస్తారని చెప్పొచ్చు. వారు బాబా ఎడల విధేయతతో తమ సర్వస్వం బాబా పాదాల చెంత సమర్పించిన వైనం పాఠకులకు తెలిసిన విషయమే.

**4. సన్యాసం:**

ఈ ప్రపంచంలో జీవిస్తూ, అన్ని విధులు, బాధ్యతలను నిర్వర్తిస్తూనే ఇతరులకు సేవ చెయ్యాలనే తలంపుతో జీవించడమే నిజమైన సన్యాసం. స్వార్థపరమైన ఆలోచనలు, కోరికలు లేని జీవితం గడపడమే నిజమైన సన్యాసం.

**5. జ్ఞానం:**

మంచివారిలో, చెడ్డవారనే వారిలో, సాధువుల్లో ఇలా అందరిలో వున్న భగవంతుడు ఒక్కడే అని తెలుసుకోవడమే నిజమైన జ్ఞానం. ఈ జ్ఞానం వల్ల ఎలాంటి స్వలాభాపేక్ష లేకుండా, ఎలాంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా, అందరినీ సమదృష్టితో చూడగలుగుతారు. ఈ జ్ఞానం వల్ల మీకు హాని చేసిన వానికి కూడా హాని తలపెట్టరు. మీకు అలాంటి ఆలోచన కూడా రాదు. మాటల్లో, చేతల్లో , కనీసం ఆలోచనల్లో కూడా మీరు ఇతరులను నొప్పించరు. కీడు చేసిన వారికి మేలు చేయ్యాలనే తలపెడతారు. సోదర భావంతో అందర్నీ సంతోషపెడతారు.

**6. నిగ్రహం:**

నిమ్నమైన కోర్కెలకు లోబడకుండా ఇంద్రియాలను నిగ్రహించడమే నిజమైన నిగ్రహం. నిగ్రహమే సంపూర్ణ సచ్ఛీలతనందిస్తుంది.

**7. శరణాగతి:**

ఎటువంటి కష్టాలు ఎదురైనప్పటికి స్థితప్రజ్ఞతతో దేవుని శరణుకోరడమే నిజమైన శరణాగతి.

## ప్రాముఖ్యత

ఈ సందేశాన్ని కొన్ని వేల ప్రతులు ప్రచురించమని బాబా ఆదేశించారు. వాటిని మన దేశంలో వున్న ప్రతి బాబా ప్రేమికునికి అందజేసి, వారి వారి ప్రాంతాల్లో పలువురికి అందజేయమన్నారు. ఈ బాధ్యతను ఆనాడు బెంగళూరులో వున్న డాక్టర్ ఘనీ మున్సిఫ్, బాబా కార్యదర్శి శ్రీ ఆదీకెఇరానీలకు అప్పగించారు. బాబా సందేశ ప్రతులను మన దేశంలోని అన్ని ప్రధాన పట్టణాలు, నగరాలలో వున్న దేవాలయాల్లోని పూజారులు, చర్చిలలో ఫాదర్లకు, మసీదులలో ముల్లాలకు ప్రత్యేకంగా అందజేయమని బాబా తన మండలిని ఆదేశించారు. 1941 తొలినాళ్ళలో యూరోపు, అమెరికా దేశాలలోని బాబా ప్రేమికులకు కూడా ఈ సందేశ ప్రతులను ఆయా ప్రాంతాల్లో పంపిణీ చేయమని బాబా ఆదేశించారు. ఈ మాదిరిగా బాబావారి సందేశాలకు విశేష ప్రచారం, పంపిణీ చేయమని ఎన్నడూ చెప్పలేదు. ఆ ప్రాముఖ్యతను **సప్తవాస్తవాలకు** మాత్రమే అవతారుడు అందజేశాడని పాఠకులు గమనించాలి. ఈ ఏడు సత్యాలు ప్రతి బాబా ప్రేమికునికి నిత్యస్మరణీయం కావాలి!!.

# బాబాలో ఐక్యం


శ్రీమతి జానకి


శ్రీమతి సీతాకళ్యాణి


శ్రీమతి జి. చంద్రకళ


శ్రీమతి పి. సరోజ

మెహెర్‌బాబాకు అత్యంత సన్నిహిత ప్రేమికుడైన పూకార్ గారి భార్య శ్రీమతి జానకీ దేవి హమీర్‌పూర్, సెప్టెంబరు 27న అవతారునిలో ఐక్యమయినట్లు ఆమె కుమారులు శ్రీ మెహెర్ నిగం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీమతి సీతాకళ్యాణి (93) అవతారుని నామస్మరణతో హైదరాబాద్‌లో సెప్టెంబరు 22న తుదిశ్వాస విడిచారు. సీతాకళ్యాణి గారి ముగ్గురు కుమారులు శ్రీకుమార్, శ్రీకాకుళం, విజయసారథి, సుధాకర్‌లు, (హైదరాబాద్) బాబా ప్రేమికులందరికీ సుపరిచితులే. తాను మెహెర్‌బాబాను 1950వ దశకంలో ఆంధ్రా పర్యటనకై ఏలూరు వచ్చినప్పుడు తొలిసారిగా దర్శించుకునానని, 1961 జూలై 10 నుండి గత 60 ఏళ్ళుగా బాబా నామస్మరణతో గడుపుతున్నానని మెహెర్‌బాబా సంచికకు ఆమె ఇటీవల 2020 మౌనవార్షికోత్సవం సందర్భంగా తెలిపారు. అవతారుని కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనే శ్రీ కాంతయ్య గారి భార్య, శ్రీమతి జి. చంద్రకళ హైదరాబాద్ అక్టోబరు 15న స్వల్ప అస్వస్థతతో తుదిశ్వాస విడిచారు. అలాగే, శ్రీ హరినాధరావు గారి భార్య శ్రీమతి పి. సరోజ అగస్టు 28న అవతారునిలో ఐక్యమయినట్లు స్థానిక ప్రేమికులు శ్రీ పాపినాయుడు తెలిపారు. గాన గంధర్వునిగా కీర్తి గడించిన శ్రీ ఎస్ పి బాలసుబ్రహ్మణ్యం బాబా ప్రేమికుడు కాకపోయినప్పటికీ, అవతారుని జీవిత చరిత్రలోని అనేక ఘట్టాలను హృద్యంగా రెండు




సంపుటాలలో శ్రీమతి యస్ జానకితో కలిసి ఆలాపించారు. అలాగే, శ్రీ ఎస్‌పి బాబావారి పలు భజన గీతాలను ఆడియో క్యాసెట్లలో ఆలాపించాడు.. మెహెర్‌బాబా మూవింగ్ మీడియా తరఫున శ్రీ సుధాకర్ భార్గవ్, హైదరాబాద్ ఈ ఆడియో క్యాసెట్లను రూపొందించగా శ్రీ బాలనాటు 2002లో జరిగిన 33వ అమరతిథిలో అవిష్కరించారని శ్రీ పందుగ రమణ తెలిపారు. శ్రీ ఎస్‌పి ధన్యుడన్నారు.

# చించోర్‌కర్



**అహ్మద్‌నగర్ నివాసి, బాబా ప్రేమికుడైన వెంకటేశ్ చించోర్‌కర్** ఇంటికి గతంలో బాబా అనేకసార్లు వెళ్ళారు. **ఐతే, 1927 ఏప్రిల్ 3న** బాబా తన మండలివారందరితో కలిసి వారింటికి ప్రత్యేకంగా వెళ్ళారు. బాబా ఈ పర్యటనలో చించోర్‌కర్‌కు ఒక చక్కని సందేశం ఇచ్చారు. అదేమిటో, ఆ వివరాలు ఇకపై గమనించండి.

****

చించోర్‌కర్ ఇంట్లోకి బాబా అడుగుపెడుతూనే, నాకు ఆకలిగా వుంది, తక్షణం భోజనం వడ్డించమన్నారు. వంట ఇంకా పూర్తికాలేదని తెలుసుకున్న బాబా, ముందుగా టీ ఇవ్వమన్నారు. టీ కూడా సిద్ధంగా లేదనగానే, బాబా చికాకుపడ్డారు. “నన్ను మీ ఇంటికి పిలిచేముందరే, నీవు అన్నీ సిద్ధంగా వుంచుకోవాలి కదా అని” బాబా సున్నితంగా ఆతడ్ని హెచ్చరించారు. ఆపై మెహెరాబాద్‌కి తిరిగి వెళ్ళడానికి లేచి నిలబడ్డారు. కొద్ది నిముషాలు టైం ఇప్పించండి. అన్నీ సిద్ధం చేస్తాను అని చించోర్‌కర్ ప్రాధేయపడగానే, బాబా అంగీకరించారు. బాబా వచ్చారని తెలిసి చుట్టుప్రక్కల వున్న చాలామంది స్త్రీ, పురుషులు బాబావారి దర్శనం కోసం వచ్చారు. వారిలో మహిళలు ఎక్కువ సంఖ్యలో వున్నారు. సద్గుర్విణి బాబాజాన్‌కి సంబంధించిన పలు విషయాలను వారితో సుమారు గంటసేపు ప్రసంగించారు. మహిళలలో ఎందరో ఆధ్యాత్మికంగా ఉన్నతిస్థితిని సాధించారన్నారు. ఎందరో సాధువులుగా, గురువులుగా ఉన్నతస్థితికి చేరుకున్నారని అన్నారు. వివాహం తర్వాత కూడా ఆధ్యాత్మిక ఉన్నతికి ప్రయత్నించమన్నారు. మానవజీవిత లక్ష్యమైన భగవంతుని చేరిక కోసం, దేవుడ్ని నిరంతరం ప్రేమించమని బాబా హితబోధ చేశారు. ఇంతలో మధ్యాహ్న సమయానికి భోజనం తయ్యారయ్యింది. ఆనాటి సమాజ కట్టుబాట్లను అనుసరించి, భోజనానికి రెండు వరుసలలో కూర్చునేలా చించోర్‌కర్ ఏర్పాటు చేశాడు. మొదటి వరుసలో హరిజనులు, ఇతర నిమ్న కులస్తుల కోసం, రెండవ వరుస బ్రాహ్మణులు, మరాఠీయులు, జోరాష్ట్రియన్లు, మరి ఇతర అగ్రకులాల వారికి ఏర్పాటు చేశారు. ఇదిఇలా వుంటే బాబా వెళ్ళి మొదటి వరుసలో



హరిజనులతో కలిసి కూర్చున్నారు. బాబాని వచ్చి రెండవ వరుసలో బ్రాహ్మణ పంక్తిలో కూర్చోవల్సిందిగా చించోర్‌కర్ ఎంత వేడుకున్నా ఆయన అందుకు అంగీకరించలేదు. ఈ ఏర్పాట్లుపై బాబాకి చాలా కోపం వచ్చింది. ఆ పిదప అహ్మద్‌నగర్ కంటోన్మెంట్ ప్రాంతంలో వున్న అనంత్ ఆశ్రమం అనే అనాథ శరణాలయానికి వెళ్ళారు. అక్కడున్న ఒక గుడ్డివాడైన ఒక పిల్లవాడిని పిలిచి, ప్రేమగా దగ్గరకు తీసుకున్నారు. ఆ పిల్లవాడ్ని ఓ పాటపాడమన్నారు. ఆ పిల్లవాడు పాడుతుంటే తోటిపిల్లలందరూ కూడా తమ గొంతుకలు కలిపారు. బాబాకు పూలమాలలు సమర్పించారు. బాబా వారి ఆశ్రమానికి వచ్చినందుకు వారెంతో సంతోషించారు. ఆ పిదప, బాబా బృందం మెహెరాబాద్‌కి సాయంత్రం 4 గంటల ప్రాంతంలో తిరిగి వచ్చారు. చించోర్‌కర్ ఇంట్లో భోజనం ఏర్పాటుచేయడంలో జాప్యం జరగడమే కాకుండా, ఆ భోజనం కోసం రెండు వరుసలు ఏర్పాటు చేయడం కూడా బాబాకు మరింత చికాకు తెప్పించింది. అంతేకాదు, చించోర్‌కర్ తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో వున్నాడు. చాలా బాధల్లో వున్నాడు. బాబా ఆతని ఇంటికి వెళ్ళి, అక్కడ జరగుతున్న ఆలస్యానికి ఆతనిపై విసుక్కుంటూ, చివాట్లు పెడుతుంటే, చించోర్‌కర్ తన బాధలన్నీ మరచిపోయి, బాబావారి రాక సందర్భంగా చేయాల్సిన పనుల్లో నిమగ్నమై, అంతవరకూ గల ఆతని బాధలన్నింటినీ క్షణకాలం మరచిపోయాడు. తన కష్టాల్ని బాబాకు చెప్పుకోవడం కూడా మరచిపోయాడు చించోర్‌కర్. బాబా మెహెరాబాద్‌కి తిరిగి వెళ్ళగానే, చించోర్‌కర్ తన కష్టాల కడలిలో మునిగిపోయాడు. ఆతని ఆర్థిక సమస్యల పరిస్థితి అలాంటిది మరి. మనస్సు కుదుటలేదు. ప్రశాంతత అసలుకే లేదు. చికాకుగా ఇంటి బయట దిగాలుగా కూర్చున్నాడు. ఆ సమయంలోనే మెహెరాబాద్ నుండి మండలి సభ్యుడైన విష్ణు సైకిల్‌పై వచ్చి, చించోర్‌కర్‌కి ఓ కవర్ ఇచ్చి, అందులో కొంత డబ్బు వుంది. ఈ కవర్‌ని బాబా నీకిచ్చి రమ్మన్నారని చెప్పాడు. బాబా నుండి డబ్బు తీసుకోవడానికి చించోర్‌కర్ ఇష్టపడలేదు. విష్ణు ఆతని మాటలు ఆలకించ లేదు సరికదా, ఇది బాబా నీకిచ్చిన ప్రేమ ప్రసాదం. నాకు మరెన్నో పనులున్నాయి. నేను వెంటనే వెళ్ళిపోవాలని చెప్పి, వచ్చిన దిక్కున రయ్యిమని వెళ్ళిపోయాడు. చించోర్‌కర్ అవతారుని ప్రేమకు ముగ్ధుడయ్యాడు. తాను అనుభవిస్తున్న ఆర్థిక కష్టాలు తన భార్యకు కూడా తెలియదు. బాబా సర్వజ్ఞుడని మనస్సులోనే రెండు చేతులూ జోడించాడు.

# హైదరాబాద్‌లో మనోనాశ్ సమావేశం

## ట్రైలర్ - ఉత్తమ నాటిక ప్రదర్శన

హైదరాబాద్‌లోని ఖాజాగూడ గుహలో మెహెర్‌బాబా 1951 అక్టోబరు 15 నుండి 24 వరకూ ఏకాంతవాసం, మనోనాశ్ కార్యక్రమం చేశారని పాఠకులకు తెలుసు. 1951 అక్టోబరు 16 నాటికి బాబా నవజీవన కార్యక్రమం చేపట్టి రెండేళ్ళు నిండాయి. ఐతే, 1951 జూన్ మొదటి వారంలో బాబా, స్త్రీ మండలి, కొంతమంది పనివారితో కలిసి హైదరాబాద్‌కి వచ్చారు. ఎంపిక చేసిన కొంతమంది ప్రేమికులకు జూన్ 28 నుండి 30 వరకూ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి తప్పక హాజరు కావల్సిందిగా ఒక సర్క్యులర్ పంపారు. మండలి వారందరి బస కోసం జూబ్లీ హిల్సులో ఒక పెద్ద బంగళాను ఆరు నెలలపాటు అద్దెకు తీసుకున్నారు. ఈ బంగళా పేరు **కోహినూర్.** ఇక్కడే బాబా తన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

ఆ బంగళాలో టెన్నిస్, బిలియర్డ్స్, స్విమ్మింగ్ పూల్, ఇలా అనేక ఆధునిక సౌకర్యాలతో చిన్న ఎత్తైన కొండపై వుంది. బాల్కనీలో నిల్చుంటే ఎదురుగా నీళ్ళతో నిండిన చెరువు కనిపిస్తుందని ఆనాటి బాబా ప్రేమికుల రచనల ద్వారా తెలుస్తోంది. ఆనాడు ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాబా ప్రేమికుడు శ్రీ బాలనాటు షోలాపూర్‌కు దగ్గర్లో



వున్న తన స్వగ్రామం కురుద్వాడి నుండి కాలేమామతో కలిసి వచ్చినట్లు తన రచనలో పేర్కొన్నారు. మన దేశంలోని పలు ప్రాంతాల నుండి రమారమిన 70 మంది ప్రేమికులకు పైగా ఈ సమావేశానికి హాజరయినట్లు ఆయన తన రచనలో పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లో రైల్వే స్టేషన్‌లో తమకు మండలి ప్రేమికుడైన విష్ణు మాస్టార్ స్వాగతం పలికి, సమావేశ ప్రాంతానికి టాక్సీలో తీసుకెళ్ళాడని అన్నారు. అక్కడకు చేరుకున్నాక, కాళ్ళూ చేతులూ కడుక్కొని ముందుగా అవతారుని దివ్య దర్శనం చేసుకున్నామన్నారు. "రేపు దేవుని ఎదుట నేను చేసే ప్రకటనకు మిమ్మలందర్నీ సాక్షులుగా పిలిచానని" బాబా అన్నారు. దైవీ మానవుడైన మెహెర్‌బాబా భగవంతుని ఎదుట ప్రకటన చేయడం ఏమిటి? మేం సాక్షులం ఏమిటని నా మటుకు నేను మనస్సులోనే అనుకున్నాను. ఆ మర్నాడు అంటే జూన్ 28 ఉదయం 8 గంటలకు సమావేశానికి హాజరైన ప్రేమికులందర్నీ వుద్దేశించి, అక్టోబరులో తాను చేపట్టబోయే మనోనాశ్ కార్యక్రమ విశిష్టత గురించి బాబా చాలా స్పష్టంగా ప్రకటించారు. సుమారు 4 గంటలపాటు ఏకబిగిన ఈ సమావేశం జరిగింది.ఆ పిదప అప్పటికే కాలయాపన జరిగిందంటూ, ఆకలి దప్పికలతో వుండగా ఆధ్యాత్మిక ప్రసంగాలు కొనసాగించడం భావ్యం కాదంటూ, అందరూ భోజనానికి వెళ్ళి 2 గంటలకల్లా సమావేశానికి రమ్మనమన్నారు బాబా. ఆనాడు బాబా ప్రవచించిన మనోనాశ్ కార్యక్రమ సందేశాన్ని **Meher Baba and the God-Determined Step** పేరిట మండలి సభ్యుడైన రమ్జూ అబ్దుల్లా గ్రంథస్తం చేశారు. ఆ రోజు తిరిగి మధ్యాహ్నం సమావేశమయ్యాక బాబా చాలా హుషారుగా, ఆనందంగా కనిపించారు. మనోనాశ్‌కు సంబంధించిన తన సందేశాన్ని ఆ మర్నాడు కొనసాగిస్తామన్నారు. "నేను బాగా అలసిపోయాను. ప్రస్తుతం సీరియస్ విషయాలు వద్దు. మనస్సు తేలికపరిచేలాగా, ఏమైనా లఘునాటికలు ప్రదర్శించమన్నారు" బాబా. అందరూ నవ్వుకునే విషయాలు చెప్పమన్నారు. మీరు సిద్ధమయ్యేందుకు ఓ గంట సమయం ఇస్తున్నామన్నారు బాబా.

## ఉత్తమ నాటికకు బహుమతి

అంతేకాదు, చక్కని ప్రదర్శన ఇచ్చినవారికి ఒక మెడల్, పది రూపాయలు నగదు ఇస్తామని బాబా ప్రకటించారు. నాటిక నిడివి సుమారు 30 నిముషాలకు మించరాదన్నారు. శ్రీ బాలనాటు తన గురించి చెబుతూ, తానేదో జోక్ చెప్పాను కానీ, అది సరిగ్గా పేలలేదన్నారు. చాలామంది ప్రేమికులు ఇంగ్లీషు, గుజరాతీ, మరాఠీ, హిందీ భాషల్లో బాబా ఎదుట తమ ప్రజ్ఞను ప్రదర్శించారు. ఆనాడు ఉదయం జరిగిన బాబా ప్రవచన సమయానికి ఇప్పటికీ చాలా తేడా వుంది. సాయంత్రం సమావేశ హాలు నవ్వుల జల్లులతో ముంచెత్తింది. అవతారుని సమక్షంలో మేమందరం




చిన్నపిల్లల్లా కేరింతలు కొట్టాం. అహ్మద్‌నగర్ నుండి హాజరయిన ధాకే ఫాల్కర్ అవతారుని సమక్షంలో **"టైలర్"** పేరిట ఒక చిన్న నాటికను ప్రదర్శించారు. బాబా ఎదుట ధాకేఫాల్కర్ ఇచ్చిన తన ప్రదర్శన విశేషాలు గురించి ఆయన తన స్వీయరచనలో ఇలా తెలియజేశారు. దయచేసి పరిశీలించండి.

## లఘు నాటిక "టైలర్"

రంగుల లుంగీ, ఎరుపు తెలుగు గీతలతో వున్న పొట్టి చేతుల చొక్కా, తలపై రూమీ టోపి, రెండు పొడవాటి కర్రలు, పొడవాటి తాళ్ళకు కట్టిన రెండు చెప్పులు..ఇవీ తన పాత్రకు అవసరమైన వస్తువులు. స్టేజి పైకి వచ్చే సరికి **"దర్జా-ఇ-అచ్ఛా, దర్జీ మురదాబాద్"** అని రాసి వున్న సైన్‌బోర్డు గోడకు వేలాడి వుంటుంది. స్టేజి మీద వున్న కుర్చీలో నేను కూర్చుని వుంటాను. నాకు ఎదురుగా టేబులు వుంది. టేబులుపై టైలర్లు వాడే టేపు, కత్తెర వున్నాయి. ముందుగా, ఒక కస్టమర్ వేదికపైకి వచ్చాడు.

**ధాకే** ఏం కావాలి!

**కస్టమర్** నాకు షెర్వానీ కుట్టిపెట్టాలి.

**ధాకే** నేను షెర్వానీ స్పెషలిస్టుని. మీరెన్నడూ ఎరగని రీతిలో షెర్వానీ కుట్టిస్తాను. ఇలా దగ్గరగా నిల్చోండి. కొలతలు తీసుకుంటాను. మీరు నిఠారుగా నిల్చోండి. మీరు తిన్నగా నిల్చున్నారో లేదో చూడ్డానికి నేను ఈ మూలమట్టంతో చూస్తాను.

తాపీ మేస్త్రీలు వాడేలాగా, పొడవాటి తాడుకు ఒక చెప్పుని కట్టి, ఆతని తల నుండి కింద పాదాల దాకా, అలాగే, మరో తాడు కట్టిన చెప్పుని తల వెనుక నుండి మోకాళ్ళ వరకూ వుంచి, ఆతను నిఠారుగా వున్నాడో లేదో చూశాను. సరే!! మీరిలాగే నిఠారుగా నిల్చోండి. కొలతలు తీసుకుంటానన్నాను. నా దగ్గరున్న రెండు పొడవాటి సన్నని కర్రలు తీసుకున్నాను. వాటిని ఆతని రెండు చేతులు – చంకలు కిందికి పోనిచ్చాను. పాత కాలపు టైలర్లు ఛాతీ కొలతలు తీసుకోవడానికి, ఛాతీ చుట్టూతా టేపు తీసుకుని

కొలిచేవారు. నేను అలా కాదు. నేను మోడ్రన్ టైలర్‌ని. నేను ఈ కర్రలతో మీ ఛాతీని కొలుస్తాను. ఆతని ఛాతీపై నా దగ్గరున్న పొడవాటి కర్రలతో ఛాతీ కొలతలు కూడా తీసుకున్నాను. సభికులంతా హర్షధ్వానాలు చేస్తున్నారు. నవ్వులతో కేరింతలు కొడుతున్నారు. ఆ తర్వాత ఆతడ్ని వంగమని చెప్పాను. అలా అతను వంగిన తర్వాత, ఆతని కుస్తా దగ్గర్నుండి, ముక్కు కింద వరకూ, తిరిగి, వెనుక మోకాళ్ళ నుండి మెడ దాకా కొలతలు తీసుకున్నాను. ఆ తర్వాత నిఠారుగా నిలుచోమని చెప్పి, ముక్కు దగ్గర్నుండి మోకాలు దాకా కొలతలు తీసుకున్నాను. తీసుకున్న కొలతలన్నింటినీ, పెన్సిల్ ములుకుతో కాకుండా, పెన్సిల్ రెండవ చివరి నుండి ఓ కాగితంపై రాసుకున్నాను. కొద్దిసేపు పెన్సిల్‌ని నోట్లో పెట్టుకుని, అటూ ఇటు తిరుగుతూ గుర్తు తెచ్చుకుంటున్నట్లు లెఖ్ఖలు చూసుకుంటూ అన్ని కొలతలు రాసుకున్నాను. అలా నడిచేటప్పుడు కూడా, నా కాలు ఒకటి పెద్దది, మరొకటి చిన్నది కావడంతో, కాలు ఎత్తి - ఎత్తి అవిటివాడిలా నడుస్తుంటే, నా వేషధారణ, నా అభినయం, ఆహార్యం సభికులనే కాదు, బాబా కూడా నవ్వు ఆపుకోలేకపోయారు. చివరిగా, కొలతలు తీసుకోవడం పూర్తయ్యింది. మీరెళ్ళి, మీ మనవడిని పంపండి. మీ షెర్వాని అప్పటికల్లా సిద్ధమౌతుంది. వెంటనే ఇచ్చేస్తానన్నాను. షెర్వానీ కుట్టాలంటే తగినంత టైం కావాలి కదా అన్నాను. రెండు తరాల సమయం కావల్సివస్తుంది.
అందుకే మీ మనవడ్ని పంపమంటున్నా అన్నాను. **
ఆలా అందర్నీ కడుపుబ్బ నవ్విస్తూ నాటకాన్ని నిర్ణీత సమయంలోపు ముగించాను. ఈ హాస్యభరిత కదంబ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా ఏరుచ్ గారి తండ్రి పాపా జెస్సావాలా వున్నారు. నా ఏకపాత్రాభినయానికి ఆయన న్యాయనిర్ణేతల పక్షాన ఉత్తమప్రదర్శన అవార్డు ప్రకటించారు. ఆ మేరకు ఓ పతకం, పది రూపాయల నగదు బాబా నాకు అందజేశారు. బాబా చాలా సంతోషించారు. నవజీవన కార్యక్రమంతో గత రెండేళ్ళుగా తాను భరించిన ఒత్తిడి నుండి ఉపశమనం కలిగిందని మెహెరుడు స్వయంగా నన్ను అభినందించారు. మెహెరుడికి చక్కని హాస్యాన్ని అందించానని, మండలి ప్రేమికులు తనను ప్రశంసించారని, ఆనాటి సంగతులు ధాకేజీ తన స్వీయరచన **In the company of Avatar Meher Baba** పేజి. 113 పేర్కొన్నారు.

****

# మెహెర్‌బాబా పత్రిక కోసం

**శ్రీ వి. నిరాకారరావు, హైదరాబాద్, మెహెర్‌బాబా పత్రిక నిర్వహణ ఖర్చుల కోసం రూ 1000/- విరాళంగా పంపారు. ధన్యవాదములు. జైబాబా.**



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్,**
**వాల్యూం-3 (1925 నుండి -**
***తెలుగుసేత:** మల్లాది రామారావ్,* **న్యూఢిల్లీ**

*(గత సంచిక తరువాయి)*

## 1931 సెప్టెంబరు 14వ తేదీ.

తూర్పు ఛల్లా కోంబ్ ఆశ్రమానికి బాబావారు వచ్చి అప్పుడే రెండు రోజులయింది.
నిన్న అమెరికన్ దొర వాట్సన్ గారు, బ్రిటీషు పత్రికా రచయిత ఛార్లెస్ పర్డమ్
ప్రభుని దర్శించారు. ఆ దర్శనం వో దివ్యానుభవం అన్నారు యిద్దరూ.
ఈ వేళ అవతారుని దర్శించి తరించిన వ్యక్తి - కిమ్.
వయస్సు 26 సంవత్సరాలు. పూర్తి పేరు కాథరన్ అన్నా టోల్‌హర్స్ట్.
చూడచక్కని అందం. ఎర్రటి జుట్టు ఆమె సొంతం.
తెలివైన పిల్ల అనిపిస్తుంది చూడగానే. ఈ మధ్యనే జూడో కూడా నేర్చుకొంటోంది.
గురువు ఎవరో తెలుసా! కోయిజుమి. అవును. అక్షరాలా కోయిజుమి.
బాబావారికి వంటవాడుగా వచ్చిన జపనీయుడు.
ఆయన చెప్పాడుట ఆమెకి బాబావారి గురించి, మెరిడిత్‌స్టార్ గురించి,
అతని ఆశ్రమం గురించీ.
'నేనూ కలుస్తా మీ బాబాని', అందామె. మెరిడిత్‌స్టార్‌కి ఉత్తరం వ్రాసింది.
అతగాడు రమ్మన్నాడు. అలా వచ్చింది కిమ్ ఛల్లా కోంబ్‌కి.
దేవదేవుడిని దర్శించింది. అయితే ఈ దర్శనం వెనుక వో చిన్న కథ దాగివుంది.
దివి నుండి భువికి దిగివచ్చిన పరాత్పరుని దర్శనం అందరికీ దొరకదు.
ఆ అదృష్టానికి పెట్టి పుట్టి వుండాలి. ఈ జన్మలోనో, వెనుక జన్మల్లోనూ.
కిమ్‌కి మెహెర్ ప్రభుదర్శనం దొరికిందీ అంటే,
అది ఆమె పూర్వజన్మ ఫలం అనాలి. ఈ మధ్యనే ఆమె బౌద్ధమతం వైపు మళ్ళింది.
అంటే, ఆధ్యాత్మిక మార్గంలో పడింది అని వేరే చెప్పాలా?
సరే ఆమె అనుభవాన్ని ఆమె మాటల్లో వినే ముందు వాట్సన్ గారి కథలోకి
మళ్ళీ వెడదాము. నిన్న (13వ తేదీ)న బాబావారిని కలిసిన
వాట్సన్ మహాశయుడు ఈ నెల (14వ తేదీన) మళ్ళీ ప్రభుని దర్శించాడు.
ఆధ్యాత్మిక ప్రయాణంలో వివిధ దశల గురించి

బాబావారు వివరించారు వో అరగంట సేపు.
కళ్ళ ముందు కనిపించే వాటిపై దృష్టి పెట్టకు.
నీ దృష్టి కళ్ళకి కనిపించని వాటిపై వుండాలి.
కళ్ళకి కనిపించనిదెవరు? దేవుడు.
నీ మనస్సు దేవుడి పైకి మళ్ళిందీ అంటే,
నీ ఆధ్యాత్మిక ప్రయాణం మొదలయినట్లే లెక్క.
నీ భగవదన్వేషణకి శ్రీకారం చుట్టినట్లే.
మరి నువ్వు ఎప్పుడు ఎదుగుతావు?
భగవంతుని స్థాయికి ఎదగాలి అంటే, రెండు పనులు చేయాలి నువ్వు.
మంచిగా నడుచుకో. కల్లా కపటం లేని వ్యక్తిగా వుండాలి.
నలుగురికీ సహాయపడాలి. సహాయమంటే, ఎలా చేయాలి.
వీళ్లకి సాయం చేశాను కాబట్టి నాకీ లాభం కలగాలి అనుకోకూడదు.
ప్రతిఫలం ఆశించకూడదు. స్వార్థం కించిత్ కూడా వుండకూడదు.
అలా నిస్వార్ధసేవ, మంచి నడవడిక వుంటే, భగవంతుని స్థాయికి చేరుకొంటావు
అని బాబావారు చెబుతుంటే, వాట్సన్ మహాశయుడు నోరు వెళ్ళబెట్టాడు.
"బాబోయ్" ఇది నావల్ల అయ్యే పనికాదు.
మంచిగా వుండమంటే వుంటానేమో కానీ,
సేవా గీవా నా వల్ల అయ్యేది కాదన్నాడు,
నేనేమీ కుర్రాడిని కాదు బాబా! ముసలాడిని!
కాలు, చేయి సరిగా ఆడని రోజులు నావి.
ఈ వయస్సులో నావల్ల కాదు నలుగురికీ సేవ చేయడం.
ఈ సేవ నాకు కుదరదు. ఇంకే మార్గమయినా చెప్పు.
మీ మాట జవదాటను అన్నాడు వినమ్రంగా.
బాబా వారు చిరునవ్వు నవ్వి" సరేలే! ఇంకో మార్గం చెబుతాను నీకు, అన్నారు.
ధైర్యంగా వుండు, బుర్ర పాడుచేసుకోకు అంటూ తమ గోష్ఠికి తెరదించారు.
మధ్యాహ్నం, భోజనం చేశాక, బాబావారు, సముద్రపు వొడ్డున కాసేపు,
అటూ యిటూ తిరిగారు. 'మేమూ నడుస్తాం మీతో అంటూ,
పర్డమ్, వాట్సన్, ఛాన్జీ, ప్రభృతులు, సముద్రపు వొడ్డున నడిచారు.
సముద్రపు నీళ్ళలో కొట్టుకువచ్చిన చిన్న చిన్న పుల్లముక్కల్ని సేకరించారు.
ఎందుకయ్యా ఈ కర్రలు అంటే, ఇవి నా తీపి గుర్తులుగా మిగులుతాయి అన్నారు.
సాయంత్రం కవితా గోష్ఠి జరిగింది.
మెరిడిత్ తన కవితలని వినిపించాడు ప్రభువుకి. మంచి కంఠస్వరం అతనిది.

కంగుమని మ్రోగింది. మెరిడిత్ కవితా పఠనం గమ్మత్తుగా సాగింది.
ఒక కవిత పూర్తికాగానే మౌనం పాటించేశాడు కాసేపు బహుశా
“మెహెరుని విశ్వ మౌనంలో నేను సహితం” అనుకొన్నాడేమో మరి!
ఏది ఏమయితేనే, అతని కవితా గానం ఆసక్తిగా సాగింది.
ప్రభువుని ఆనంద పరిచింది.
కాసేపటికి పిలుపు వెళ్ళింది కిమ్‌కి.
“బాబా వారిని దర్శించు”, అన్నాడు మెరిడిత్.
బాబావారు రిట్రీట్‌కి వచ్చి ఇరవై నాలుగు గంటలు అవుతున్నా,
ప్రభుదర్శనం కాలేదు ఆమెకు. నిన్న బాబా వారు కారు దిగినప్పుడూ చూడలేదు.
బాబా వారినే కాదు. ప్రభువు వెంట వచ్చిన ఛార్లీ ప్రభృతులని కూడా చూడలేదు
అప్పటి వరకూ. మెరిడిత్‌తో పరిచయం కూడా కొద్ది పాటిదే.
బాబావారి రాక గురించి కోయిజుమి చెప్పగానే మెరిడిత్‌కి లేఖ వ్రాసింది.
ఆశ్రమానికి రావాలని వుంటే  తప్పకుండారా’ అన్నాడు అతగాడు.
“మాది ఆశ్రమం. మెత్తటి పరుపులుండవు జాగ్రత్త అని, హెచ్చరించాడు.
మెహెర్‌బాబా మా ఆశ్రమానికి వస్తున్నారని వ్రాసాడు కానీ పెద్దగా వివరాలు చెప్పలేదు.
పర్డమ్ ప్రభృతుల మాదిరిగా తాను వో రెండు రోజుల ముందే వచ్చింది.
ప్రభువు దర్శనం కోసం ఎదురు చూస్తోంది.
మరి యిప్పుడు, మెరిడిత్ పచ్చజెండా వూపగానే, బిరబిరా మేడ మెట్లు ఎక్కింది.
బాబా వారి గది ముందు నిలబడింది. ఎదురుగా కనిపించారు బాబా.
తెల్లటి సాద్రలో మెరిసిపోతున్నారు.
ఈయనేనా? ఈయన దర్శనం కోసమేనా? అనిపించింది.
అదీ ఒక క్షణం. ఆ తర్వాత  ఏమయిందో తెలీదు.
ఇప్పటికీ, ఇన్ని ఏళ్ల తర్వాత కూడా.
“ఏమో! ఏమయిందో అప్పుడు నాకు గుర్తు  రావటం తెలుసు.
క్షణకాలం అంతా స్థంభించి పోయింది.
ఏమయిందీ, ఏమవుతోందీ నాకు తెలీదు. స్పృహలో వుంటే కదా?
ఏదో కథలోలాగా జరిగిపోయింది అంతా”, ఇదీ కిమ్ స్వగతం.
బాబావారి పాదాల చెంత వ్రాలింది. దుఃఖం పొంగి వచ్చింది.
కనీళ్ళు ఆగకుండా కారుతున్నాయి. ఇలా ఎప్పుడూ జరగలేదు.
ఈవేళ ఇప్పుడు ఎందుకీ దుఃఖం. మనస్సు బాగాలేకనేమో?
అబ్బే, అదేమీ లేదు. నా మనస్సుకే భేషుగ్గా వుంది.

నాకే బాధలేదు. ఎందుకని అబ్బా! ఈ కనీళ్ళు జలపాతంలా కారుతున్నాయి.
బహుశా ఈ కనీళ్ళు నన్ను పునీతురాలిని చేస్తున్నాయి.
"అయ్యో! పొరపాటు చేసేనే" అనుకొన్నా.
నా పాత జ్ఞాపకాలని తుడిచి పెట్టేస్తున్నాయి ఈ జలధార.
ఈ ఆలోచన రాగానే మనస్సు తేలిక పడింది.
ప్రభువు కొత్త జన్మని ప్రసాదిస్తున్నాడన్న భావన ఆనందం తెచ్చింది.
మనస్సు గెంతులు వేసింది, అంటూ కిమ్ ఆనాటి మధుర ఘడియలు గురించి చెప్పింది.
చాలాసేపే వున్నాను బాబావారి దగ్గర మోకరిల్లి అంది.
కన్నీళ్ళు చెమరుస్తూనే వున్నాయట చాలాసేపు"
ఎంతసేపు కన్నీరు కార్చేనో చెప్పలేను, అంది.
ఎవరో నన్ను పైకి లేవనెత్తారు. మంచంపై పడుకోబెట్టారు.
నిద్రలోకి జారిపోతుంటే ఛాన్జీ స్వరం వినబడింది.
బాబావారు అక్షర ఫలకంపై చెప్తుంటే, అతను పైకి చదివాడు.
"ఈమె నా దగ్గర వుండాలి" ఇది ప్రభువాజ్ఞ.
ఛాన్జీ నోట ప్రభవాజ్ఞ వినిపిస్తుంటే నిద్రలోకి జారిపోయాను.
ఎంతసేపు పడుకొన్నానో? అలా ఎందుకు అయిందో, అంతా బాబా మహిమ.
భళ్ళున తెల్లవారాక మెళుకువ వచ్చింది. మనస్సు నిర్మలంగా వుంది.
బాబావారి దగ్గరే ఎక్కువసేపు వుండాలన్న తపన బయలుదేరింది.
కిమ్ అదృష్టవంతురాలు.
మెహెరుడు ప్రసాదించిన మధురానుభూతి వో అపూర్వ వరం.
అందరికీ దక్కదు. దొరకదు. ఇది ఆమె పూర్వజన్మ సుకృతం.
క్రైస్తవ కుటుంబంలో పుట్టిన ఆమెకి చిన్నప్పటి నుంచీ
ఆరాధ్య దైవం ఏసు ప్రభువు. మెహెరునిలో ఆమెకి ఏసు కనిపించాడు.
(మా ఇంటిలో దయామయుడి ఫోటోలు చాలానే వున్నాయి.
ఆ బొమ్మలు చూస్తూ పెరిగాను.
గోడ కేసి చూసిన ప్రతిసారీ ఏసు ప్రభువు చిరునవ్వుతో కనిపించేవాడు.
నా మనస్సు కరిగిపోయేది.
ప్రభువు కళ్ళలో దయ, ప్రేమ తప్ప కోపం కనబడలేదు ఎప్పుడూను.
మానవాళి కోసం ఎన్ని బాధలు అనుభవించారు.
చివరికి శిలవ వేసినా పాపులని క్షమించమన్నాడు తప్ప,
శపించ లేదు సరికదా అంతబాధనీ చిరునవ్వుతో అనుభవించాడు అనిపించేది,
అని అంటూ కిమ్ మరో మాట అన్నది.

క్రీస్తును చూస్తుంటే నాకేమనిపించేదో చెప్పనా?
మనలో లోపాలు ఎన్ని వున్నా సరే, ఏసుకి మనలో రాగల పరివర్తన కనిపిస్తుంది.
ఆ పరివర్తన మనలో వచ్చేలా చేస్తాడు ఏసు ప్రభువు అనిపించేది.
ఈ వేళ మెహెరునిలో ఏసుని చూశాను. జీసస్ వంటి వాడు బాబా అనిపించింది,
అని మనసులో మాట చెప్పింది కిమ్. మర్నాడు, సెప్టెంబరు 15వ తేదీ
మంగళవారంనాడు బాబావారు పర్దమ్‌కి వో హిత వాక్యం చెప్పారు.
ఎలా వున్నావు అని అడిగారు. "ఏం చెప్పమంటావ్ బాబా!,
నాకేదో అవుతోంది అన్నాడు.
'ఏమయింది' అన్నారు బాబా.
నా గుండెని ఏదో ఆవహించింది. ఇది తల నుంచి వచ్చింది. ఒక్కటి రెండు కాదు,
నా బుర్రలో వున్న ప్రతీదీ గుండెల్లోకి వచ్చేసింది.
మంటలు రేపింది, అని పర్దమ్ చెప్పాడు
"అలానా!! అయితే, మంచిదే" అన్నారు బాబా. నమ్మకం గురించి చెప్పారు.
జ్ఞానం, దర్శనం, అనుభవం వల్ల నమ్మకం కలగవచ్చు
సాధకుడికి ఆధ్యాత్మిక మార్గంలో అన్నారు. నమ్మకం అదే గురి అవసరం.
అప్పుడే ముందుకు వెళ్ళగల్గేది అన్నారు.
సరస్వతీ మానస పుత్రుడు అయిన పర్దమ్ గారి మనస్సుకి హత్తుకొంది
బాబావారి ఉవాచ. ఇలా మరో యిద్దరు ముగ్గురికి హితవాక్యం చెప్పాక,
బాబావారు మేడ దిగి వచ్చారు. బయట కాసేపు పచార్లు చేశారు.
కొంతమంది జిజ్ఞాసువులు బాబా వారి వెంట అడుగులో అడుగు వేస్తూ కనిపించారు.
మెరిడిత్ దంపతులు– మెరిడిత్ స్టార్, మార్గరెట్ భక్తి పాటలు పాడారు.
మెహెరుడు దేదీప్యమానంగా కనిపించాడు. ఈ ఆనంద సమయంలో మెహెరీశుడు
దేవ రహస్యాన్ని వెల్లడించారు యావత్ ప్రపంచానికి 'నేనే అవతారుడిని', అని
ప్రకటించారు. 'మానవోద్ధరణకి దివి నుండి దిగి వచ్చిన పరబ్రహ్మని నేను', అని
విశదీకరించారు. షెరియార్జీ సుతుని వాక్కు ప్రాక్, పశ్చిమ దేశవాసుల్ని
సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తింది. ఇంతవరకూ, భారతీయుల దృష్టిలో మెహెరుడు
కేవలం సద్గురువు మాత్రమే. ప్రభువు నిజరూపం వాళ్ళకి తెలియదు. ఇదిగో ఇప్పుడు
మెహెరీశుడు ఉన్నతోన్నతుడనీ, సర్వోత్తముడనీ తెలిసి వచ్చింది. బహుశా, తమ దైవత్వాన్ని
వెల్లడించడానికే మెహెరీశుడు పశ్చిమ దేశ యాత్ర చేశారేమో?
ఎందుకంటే, ఏ అవతార కాలంలోనూ, అలనాడు జొరాస్టరుగా వచ్చినా,
ఏసుక్రీస్తుగా మళ్ళీ వచ్చినా, మహమ్మద్ ప్రవక్తగా దర్శనమిచ్చినా
దైవీ మానవుడు పశ్చిమానికి వచ్చిన దాఖలా లేదు.

రాముడిగా, కృష్ణుడిగా, బుద్ధుడిగా అవతరించింది భారతదేశంలోనే.
ఇదిగో ఇప్పుడు మెహెరుడు ఆ లోటు తీర్చాడు. తమ పాద ధూళితో పశ్చిమాన్ని పావనం చేశారు. భౌతికవాదంలో పడి, ప్రాపంచిక సుఖాల కోసమే వెంపర్లాడుతున్న తెల్లవారిని తట్టి లేపారు. ఆధ్యాత్మికతవైపు దృష్టి మరల్చారు వాళ్ళకి.
మేల్కొల్పుటకే వచ్చాను, బోధించుటకు రాలేదు అంటూ
వాళ్ళకి తమ ప్రేమ పంజరంలో చోటిచ్చారు.
బాబావారు అమెరికా వస్తే బాగుండును అనిపించింది వాట్సన్ దొర గారికి.
పశ్చిమ దేశాలంటే కేవలం బ్రిటన్ వొక్కటే కాదు కదా! ఐరోపా ఖండం కూడా కాదు.
మా అమెరికా సంగతి ఏమిటి? మా దేశం వస్తే అవతారుడికి బ్రహ్మరథం పట్టము మేమంతా అనుకొన్నారు. మనసులో మాట మెహెరీశునితో అన్నాడు.
“అమెరికా రావాలి మీరు” అన్నాడు. మీరు “వూ” అంటే ఏర్పాట్లు చేస్తాను అంటూ
“అమెరికా ప్రజలందరి తరపున నేను ఆహ్వానిస్తున్నాను.
నా మాట కాదనకండి, అని వేడుకొన్నాడు.
చిరునవ్వు నవ్వారు బాబా. అమెరికా వెళ్ళాలన్న ఆలోచన వుంది ప్రభువుకి చాలాకాలంగా. అయినా ఈవాళ వాట్సన్ ఆహ్వానానికి స్పందించలేదు సరికదా ‘ఇప్పట్లో వచ్చేది లేదు’ అని స్పష్టం చేశారు. ప్రస్తుతం నా దృష్టి అంతా ఐరోపాపైనే. ఐదారు ఆశ్రమాలని తెరవాలి ఈ నేలపైన. ఆ దరిమిలా చూద్దాం అంటూ బాబా, వాట్సన్ గారి ఉత్సాహాన్ని నీరు కార్చారు.
అయినా పట్టువదలలేదు ఆ మహానుభావుడు.
మీరు రాను ఇప్పట్లో అంటే ఎలాగ ప్రభూ. మీవంటి ఆధ్యాత్మిక సంపన్నుల కోసం ఎదురు చూస్తోంది మా అమెరికా. భౌతిక వాదంలో కూరుకు పోయింది.
కనికరించండి ప్రభు అని వేడుకొన్నాడు పదేపదే.
దయామయుడి మనస్సు కరిగింది.
‘వస్తాలే’, అన్నాడు.
వాట్సన్ దొర గారు ఆనందం మాటల్లో చెప్పలేము. వెంటనే అమెరికా వెళ్ళాలి అనిపించింది. ఆ మాటే భార్యతో అన్నాడు.
మనం బయలుదేరాలోయ్. ప్రభువు రాకకి ఏర్పాట్లు మొదలు పెట్టాలోయ్ అన్నాడు.
ఆ ఇల్లాలు తలవూపింది. సరేనంది.
ఇంతకీ, అమెరికా వెళ్ళాలన్న ఆలోచన వున్న మెహెరీశుడు,
వాట్సన్ గారి పిలుపుని ఎందుకు తిరస్కరించారు.
మళ్ళీ ఎందుకు వస్తాలేనని అభయం పలికారు.
ఇవి చిక్కుప్రశ్నలు.

ఇటువంటి ప్రశ్నలు మెహెరీశంలో తరచు ఎదురవుతాయి.
ఎంతగా తరచి చూసినా అంతుచిక్కదు.
అవతారుని లీల ఇదంతా అని సరిపెట్టుకోవాలి.
అంతే! వాట్సన్ గారి అభిప్రాయం కూడా యిదే.
మెహెర్‌బాబా వారితో ఒక్కక్షణం గడిపినా,
ఏడాది పాటు ఆయన దగ్గరే వున్నా ఫలితం వొక్కటే అంటాడాయన.
ఇది ఎలాగ మహానుభావా అంటే వో చిన్న ఉపన్యాసం యిచ్చాడు.
ఇంతకీ ఆయన అనేది ఏమిటీ అంటే,
మెహెర్‌బాబా వారు దేముడు.
ఆయన్ని దర్శించిన క్షణంలోనే,
ఆయన సమక్షంలోకి రాగానే విదితమయిందీ సంగతి నాకు.
మెహెరీశుడు ప్రేమమయుడు.
మెహెరుని ప్రేమ విశ్వప్రేమ అంటూ మెహెరీశుని దైవత్వానికి అద్దం పట్టాడు.
ఈ సంగతి ప్రభువు అనుగ్రహంతో సెకండులో తెలిసింది.
ఏడాదిపాటు ఆయన దగ్గరే వున్నా యిదే కదా తెలిసేది.
ఇంతకంటే ఎక్కువ ఏముంది తెలుసుకోడానికి కనుక, అన్నాడు
తనలో తాను మాట్లాడుకొంటున్నట్లు.
అమెరికాలో బాబావారికి ఘనమైన ఏర్పాట్లు చేయాలని సంకల్పించాడు.
శుక్రవారం, 18న వాపసు బయలుదేరాలనుకొన్నాడు.
ప్రముఖులకి బాబావారిని పరిచయం చేయాలి.
వాళ్ళకి ప్రభువు ఘనత వెల్లడించాలి అనుకొన్నాడు.
మెహెరుడి వేషభాషలు వాళ్లకి నచ్చవేమోనన్న అనుమానం వచ్చింది.
ఆ పొడువాటి జుట్టు ఆడవాళ్ళ మాదిరిగా ఏమీ బాగాలేదు.
సాద్ర అట!!
ఏమిటో అది వో గౌనులా పైనుంచి క్రిందవరకూ వుంది.
ఇలా వస్తే మా అమెరికన్లు ఏమనుకొంటారు.
సూటు బూటు వేసుకొనే మావాళ్ళకి
మెహెర్‌బాబా అసలు నచ్చుతాడా!
తలపట్టుకొన్నాడు.
బుర్ర వేడి ఎక్కింది పదునైన ఐడియా వచ్చింది.
'ఏముంది అబ్బా! జుట్టు కత్తిరిస్తే పోలా!
అందంగా చక్కటి క్రాఫ్ చేయిద్దాము అనిపించింది.

వెంటనే వూపిరి పీల్చుకొన్నాడు. సూటు బూటు వేసుకోమంటే?
ఇంకా బేషుగ్గా వుండదు! మన అమెరికన్ దొరలా మెరిసిపోతారు మెహెరుడు
అనిపించింది. అమెరికా గడ్డపై బాబావారు కాలుమోపే సరికి, ప్రభువుని మార్చాలిసిందే.
లేకపోతే, బాబానో వింత వ్యక్తిగా చూస్తారు. వంది మాగధులు చుట్టూతా చేరతారు.
మంత్రాలు, తంత్రాలు చేసే వ్యక్తిగా కొట్టి పారేస్తారు అనిపించింది
వాట్సన్ గారికి. మెహెరుడు దేముడు కదా!
ఎలా వున్నా ఏమిటి? అన్న ఆలోచన రాలేదు మహానుభావుడికి.
ఆధ్యాత్మిక సంపన్నుడివి బాబా అంటూ, మా అందరిలా సూటు బూటు
వేసుకోమంటున్నాడు. వింతగా లేదు పాఠక మహాశయ?
ఇదే! మాయా ప్రభావం అంటే!
బాబా వారి అమెరికా యాత్రకి మరోసారధి– ఆల్బర్ట్ మిలోషాట్టక్ కవి.
వయస్సు– 25 ఏళ్ళు. బాబావారి గురించి వాట్సన్‌కి చెప్పింది యితగాడే.
మరో యిద్దరి చెవిలో కూడా బాబా నామం వేశాడు.
వాళ్ళే మాల్కమ్‌స్కాలోస్, జీన్ ఏడ్రియల్.
వాట్సన్ అమెరికా వాపసు వచ్చే సరికి ఈ యిద్దరూ ప్రభు రాకకి సన్నాహాలు చేస్తున్నారు.
ఆ వివరాలలోకి వెళ్ళేముందు, మిలో గురించి చెప్పాలి, కాస్తంత వివరంగా.
మసాచూసెట్స్ రాష్ట్రం వోర్సెస్టర్ నగర నివాసి మిలో గారు.
విశ్వవిఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో డిగ్రిపూర్తి చేశాడు
అదీ 1928వ సంవత్సరంలో. ఆనాటి ప్రఖ్యాత వక్త రిచర్డ్ హల్లిబర్టన్‌కి
కార్యదర్శిగా పనిచేశాడు. రిచర్డ్‌తో దేశమంతా తిరిగాడు. పర్యాటక ప్రాంతాల గురించి
ఆయనకి క్షుణ్ణంగా తెలుసు. ఆ వివరాలు చెప్పమని పిలిచేవారు. పిలిచిందే తడువుగా
వెళ్ళి, అనర్గళంగా ఉపన్యాసం చేప్పేవాడు. ఆయనకి కార్యదర్శిగా మిలో కూడా
మంచి గిరాకీ ఏర్పడింది. నలుగురూ పరిచయమయ్యారు. నాలుగు వూళ్ళు తెలిశాయి.
బహుశా యిందువల్లనే, మెహెర్ అమెరికా యాత్రకి తానూ వో సారధి అయ్యాడు.
మెహెర్ ప్రేమబీజం యితగాడిలో 1930 ప్రాంతంలో పడింది. అంటే డిగ్రీ అయిన
రెండేళ్ళకి. అదివో గమ్మత్తయిన కథ. చదువుకొనే రోజుల్లో వో నాటక రచయిత
పరిచయమయ్యాడు. అతని పేరు– థోరన్‌టన్ విల్‌డెర్.
వెయ్యి డాలర్లు చేతిలో పెట్టాడు. ఎక్కడికైనా వెళ్ళు. దేశవిదేశాల్లో ఎక్కడికయినా సరే.
ఈ డబ్బు ఖర్చు అయ్యే సరికి మనిషిలా ఎదగాల నువ్వు అన్నాడు. చిత్తం దేవరా
అన్నాడు. రోడ్డున పడ్డాడు. 1930 ఏప్రిల్ ఒకటవ తేదీ నాటికి నార్త్ డెవెన్‌షైర్‌లో
అడుగు పెట్టాడు మిలో. ఏప్రిల్ ఒకటిని మూర్ఖుల దినంగా పాటిస్తారు చాలా దేశాల్లో.
మన మిలో గారు చదువుకొన్న మూర్ఖ శిఖామణి.

ఏడాదిన్నర పాటున్నాడు అక్కడ పొట్ట గడవడానికి స్థానిక స్కూల్లో పాఠాలు చెప్పాడు. మెరిడిత్‌స్టార్‌తో పరిచయమయింది. ఆ పరిచయం స్నేహంగా మారింది. మెహెర్ నామామృతం సేవించాడు. జీవిత గమ్యం, ధ్యేయం మారింది. 'ఇక్కడ ఎంతకాలం వుంటావు. అమెరికా వెళ్ళి నలుగురికీ చెప్పు మెహెర్‌బాబా గురించి, అన్నాడు మెరిడిత్. సరేనన్నాడు మిలో. అప్పటికి నార్త్ దెవోన్‌కి వచ్చి ఏడాదిన్నర అయింది. శీతాకాలం వెళ్ళి ఎండాకాలం వచ్చింది. 1931వ సంవత్సరం అది. మెహెర్‌బాబా ఇంగ్లాండ్‌కి వస్తున్నారు ఆ ఏడాది. ఈ సంగతి నలుగురికీ చెప్పు అన్నాడు మెరిడిత్. తలాడించాడు మిలో. అమెరికా దారి పట్టాడు. బాబావారి వైనం వాట్సన్ చెవిన వేశాడు. అతగాడు, మెరిడిత్ ఆశ్రమానికి బయలుదేరాడు భార్యతో సహా. మాల్కమ్, జీన్‌లకి కూడా చెపాడు. బాబావారు పశ్చిమ దేశ యాత్ర చేయబోతున్నారన్నాడు. త్వరలో ఇంగ్లాండ్ వస్తారనీ, మెరిడిత్ ఆశ్రమంలో బస చేస్తారనీ చెప్పాడు. అప్పట్లో, వో ఆధ్యాత్మిక కేంద్రం తెరిచే ఆలోచనలో వున్నారా దంపతులు. సాధకుల నిలయం కావాలి మా కేంద్రం. ఇదే మా ఆకాంక్ష అన్నారు. ఈ కేంద్రానికి ఎవరైనా రావచ్చు. ధ్యానం చేసుకోవచ్చు. ఇక్కడ నిశ్శబ్దం తాండవిస్తుంది. ఆ మౌన వాతావరణంలో ధ్యానం బాగా చేయవచ్చన్నది నమ్మకం అన్నాడు మాల్కమ్. మీ ఆలోచన భేషుగ్గా వుందన్నాడు మిలో. బాబావారు చాలా కాలంగా మౌనంగా వుంటున్నారన్నాడు. "అలానా, అయితే ఆయన్ని దర్శించాల్సిందే, మేము అన్నాడు. మాల్కం వాళ్ళు వున్నది, న్యూ హామ్‌షైర్‌లో హన్‌కాన్ అన్నచోట. కాథరీన్ గార్డెనర్ గారి వ్యవసాయ క్షేత్రంలో బస. ఇక్కడినుంచి ఇంగ్లాండ్ దగ్గరా? దాపా? అక్కడ మెరిడిత్ స్టార్ ఆశ్రమం ఏమూల వుందో. అది వెతుక్కుంటూ వెళ్ళాలి. దూరాభారం అలా వుంచి ప్రయాణం ఖర్చులు తడిసిమోపుడవుతాయి. అంత డబ్బు లేదు అని మాల్కమ్ జీన్ తల పట్టుకొన్నారు. తమ మూగబాధని మెరిడిత్ చెవిన వేశారు. వీళ్ళ ఉత్తరాన్ని అతగాడు బాబావారికి చూపించాడు.ప్రభువు స్పందించారు వెంటనే "వాళ్ళిద్దరూ నా కళ్ళు" అన్నారు. నన్ను కలవాలి వారు ఇది అవసరం", అన్నారు. ఈ మాటని వాళ్ళకి చేరవేశాడు మెరిడిత్. మాల్కమ్, జీన్‌లు ఇంగ్లాండ్ యాత్రకి సన్నద్ధులయ్యారు. వాట్సన్ కొంత గుప్త దానం చేశాడు. మరి కొంత సొమ్ము మిత్రులు సమకూర్చారు. 1931 అక్టోబరు నాటికి యాత్రకి రంగం సిద్ధమయింది. ఇంతలో అశనిపాతంలా టెలిగ్రామ్ వచ్చింది. పంపినవారు మెరిడిత్‌స్టార్. "మీరు రావద్దు" అన్నది సందేశం. "అయ్యో", అనిపించింది మాల్కమ్, జీన్‌లకి. అంత నిరాశలోనూ వూరట దొరికింది అని ఎలా అంటే, రావద్దు అంటూనే, మెరిడిత్ మరో తీపి కబురు పంపాడు. "బాబా వారే అమెరికా రాబోతున్నారు. ప్రభువుకి ఆతిథ్యం మీరే ఇవ్వాలి', అన్నది ఆ కబురు సారాంశం.

ఎగిరి గంతువేశారు ఆనందంతో వారిద్దరు. ఇలా, ఈ ప్రకారంగా, వాట్సన్ అమెరికా వాపసు వచ్చే సరికే, మెహెరీశునికి స్వాగత సన్నాహాలు మొదలయినై. న్యూయార్క్ నగర శివార్లలో, బాబా వారికి విడిది నేర్పాటు చేశారు. క్రోటన్ నదివొడ్డున నగరానికి నలభయి కిలోమీటర్ల దూరంలో వుందా బస. హార్మోన్ రిట్రీట్ దాని పేరు. ఆధ్యాత్మిక చింతన వున్న వో 3560 మందిని అక్కడికి ఆహ్వానించారు. వస్తున్నాడు మన పాలిటి దైవం దర్శించి, తరించండి, అని చెప్పారు వాళ్ళకి. ఈ ఏర్పాట్ల వివరాలని ఎప్పటికప్పుడు మెరిడిత్‌కి తెలియజేస్తున్నారు. ప్రభువు ఎప్పుడు వస్తున్నారు. మేము రెడీ అన్ని ఏర్పాట్లు చేశాం అని మెరిడిత్‌కి లేఖ వ్రాశాడు. మళ్ళీ మనం కాసేపు మెరిడిత్ ఆశ్రమానికి వాపసు వస్తే, 15వ తేదీ రాత్రి కిట్టీ, ఆమె అక్క కూతురు జిల్లా డెవెన్‌షేర్ వచ్చారు. తొమ్మిది అయింది. అప్పటికి బాబావారి దర్శనం దొరికింది. వో మూడు నాలుగు నిమిషాలు ప్రభువు దగ్గర వున్నారు. ఇంత ప్రొద్దుపోయినా దర్శనం దొరికింది. ఎంత అదృష్టవంతులమో అని పొంగి పోయారిద్దరు. –సశేషం

# ముటుకూరు కేంద్ర వార్షికోత్సవం



గుంటూరు జిల్లా దుర్గికి సమీపంలోని ముటుకూరు గ్రామంలో వున్న బాబా కేంద్ర వార్షికోత్సవాన్ని 2020 అక్టోబరు 14న ఘనంగా నిర్వహించినట్లు కేంద్ర స్థాపకులు శ్రీ యాగంటి సుబ్బయ్య తెలిపారు. స్థానిక బాబా ప్రేమికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బాబావారి సందేశాలపై ప్రసంగం, భజన గీతాలాపన, ప్రార్థనలు చేసినట్లు శ్రీ సుబ్బయ్య తెలిపారు.

## చల్లపల్లి బాబా కేంద్రంలో

ప్రతి ఆదివారం ఉదయం 7 నుండి రాత్రి 7 వరకూ స్థానికంగా వున్న ప్రతి బాబా ప్రేమికుని ఇంట్లో ఒక్కొక్కరు 30 నిముషాల చొప్పున ఎవరి ఇళ్ళలో వారుండి ఏకనామ కార్యక్రమం ఒక ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్నామని కార్యదర్శి శ్రీ రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు.

## లఘు నాటిక

# ఆపద్బాంధవుడు మెహెర్‌బాబా

### రచన-వల్లూరి నాగేశ్వరరావు (వనారా)

ప్రయక్తి- ఇది హమీర్‌పూర్ జిల్లాలో జరిగిన యదార్థ సంఘటన. ఒక పల్లెటూరులో బాబూరామ్ అనే బడిపంతులు ఉంటున్నాడు. అతను మెహెర్‌బాబా ప్రేమికుడు. బాబాను అమితంగా ప్రేమిస్తుండేవాడు. అతనికి తల్లి కూడా ఉంది. ఆమె పేరు జాగ్రాణీ. అయితే జాగ్రాణికి బాబా అంటే అంతగా నమ్మకం లేదు. పూర్వం నుంచి రైతువారి కుటుంబం కావటం వలన ఆమె పొలం పనులు చేసుకోవటం, మేకలకు గడ్డి కోసుకొని రావటం చేస్తూ వుండేది. ఊరవతలకు వెళ్ళి గడ్డి కోసుకురావటానికి వెళ్ళేదామె. ఇలా వుంటున్న సమయంలో ఒక అద్భుత సంఘటన జరుగుతుంది. అదేమిటో ఈ లఘునాటిక ద్వారా తెలుసుకుందాం!!.

ఇందు పాత్రలు- బాబూరామ్- 30 సంవత్సరాలు. జాగ్రాణి- 70 సంవత్సరాలు, దొంగ - 30 సంవత్సరాలు. రెండు తెల్ల ఆవులు. (అది బాబా ప్రేమికుడైన బాబూరామ్ ఇల్లు. అతని తల్లి జాగ్రాణి, ఆమె మేకలను చూసుకొంటోంది).

****

**జాగ్రాణి :** ఒరేయ్ నాయనా... బాబూరామ్ నేను అలా ఏటి ఒడ్డుకు వెళ్ళి మన మేకలకు గడ్డి కోసుకొని వస్తాను.

**బాబూరామ్:** అమ్మా! నీకెందుకు వచ్చింది ఈ వయస్సులో... హాయిగా యింటి పట్టునే ఉండొచ్చు కదా...

**జాగ్రాణి :** చక్కగా చెప్పుతావు బాబూరామ్... మేకలకు గడ్డి గట్రా ఎవరు పెడతారు... నువ్వేమి పట్టించుకోవు.. నీకా బడి.. ఇల్లు లేకపోతే ఆ బాబా పుస్తకాలు పట్టుకొని కూర్చుంటావు... నీకు అదే పని.. నేను మాత్రం యింటి పట్టున ఉండలేనయ్యా...

**బాబూరామ్:** అది కాదమ్మా... నీకెన్ని సార్లు చెప్పినా వినవు.. ఈ వయస్సులో అంత దూరం వెళ్ళి గడ్డి కోసుకు రావాలా... ఉండి పోవచ్చు కదా.. నేనా బడిపంతులు ఉద్యోగం చేస్తున్నాను కదా.. మనకు ఏ లోటు లేకుండా బాబా అన్నీ యిచ్చాడు కదా.. మరెందుకమ్మా కష్టపడతావు...

**జాగ్రాణి :** చాలా బాగుంది నాయనా... ఈ పని మీ నాన్న, మీ తాత ఉన్నప్పటి నుంచి చేస్తున్నాను కదా.. యిప్పుడు కాదంటే ఎలా? అయినా తాత

ముత్తాతలు నుండి ఉన్నదే... పాలు పితకడం, పశువులను మేపడం, పొలం పనులు చూసుకోవడం యిది ఈనాటిది కాదు.. నీకు బడిపంతులు ఉద్యోగం వచ్చిందని మానేయమంటావా.. ఏదో సామెత చెప్పినట్టు వుంది...

**బాబూరామ్:** ఎప్పుడు నీ మాటే గాని నా మాట వినవు.. నీ యిష్టం అమ్మా... అలాగే వెళ్ళు... కానీ నువ్వు ఏ పనిచేస్తున్నా బాబా నామాన్ని మరచిపోకు... బాబాను స్మరించటం వల్ల నీకే ఆపదలు రావు...

**జాగ్రాణి :** బాబూరామ్! పిల్లలకు పాఠాలు చెప్పినట్టు చెప్పుతావు నాకు. అయినా బాబా నామంతో అంత మహిమ ఉందంటావా... ఏదో నువ్వు చెప్పుతున్నావని నమ్మటంగాని నాకయితే బాబా మీద అంత నమ్మకం లేదు.. అయినా బాబా దేవుడంటావా. నీ నమ్మకం నీది అనుకో..

**బాబూరామ్:** అమ్మా! నువ్వు నమ్మినా, నమ్మకపోయినా బాబా సాక్షాత్తు భగవంతుడు.

**జాగ్రాణి :** ఆ బాబా నీకు ఏ మాయా మంత్రం వేసాడో గాని బాబా తప్ప వేరే మాట ఉండదు. నా కెందుకు వచ్చింది గాని నేను వెళ్ళి గడ్డి కోసుకొని వస్తాను. (అంటూ వెళ్తుంది). (జాగ్రాణి ఊరుబయట ఏటి ఒడ్డున నిర్జీవ ప్రదేశంలో గడ్డి కోస్తూ వుంటుంది. అక్కడకు దృఢకాయుడైన ఒక దొంగ చేతిలో దుడ్డు కర్ర పట్టుకొని వస్తాడు)

**జాగ్రాణి :** (ఏదో పాటలు పాడుకుంటూ గడ్డి కోసుకుంటూ ఉంటుంది)

**దొంగ :** హే ముసలిదానా.. మంచి జోరు మీదున్నావే. పాటలు గట్రా పాడుతున్నవే... ఏటి సంగతి... నన్నెరుగుదువా... నేనెవరో నీకు తెలుసా?

**జాగ్రాణి :** ఎవరు బాబు... నేనెప్పుడు నిన్ను చూడలేదు... ఎక్కడుంటావేటి...

**దొంగ :** ఎక్కడుంటె నీకెందుకే... ముందు నీ మెళ్ళో వున్న ఆ బంగారు పట్టి యిచ్చేయ్. అదిగో ఆ కాళ్ళకున్న వెండి కడియాలు యిలా యిచ్చేయ్. యిదిగో నీ చెవులుకున్న ఆ చెవి పోగులు కూడా యిలా యిచ్చేయ్..

**జాగ్రాణి :** ఏట్రా మాటాడుతున్నావు... ఏమిటి నా మెళ్ళోవి, నా కాళ్ళవి, నా చెవులివి నీకు యిచ్చేయాలా.. ఎక్కడ నుండి వచ్చినావురా.. నీ అబ్బ సొమ్మనుకున్నవా... యివ్వన్నీ యివ్వడానికి...

**దొంగ :** చాలు చాల్లేవే ముసలిదానా... నువ్వుగాని యివ్వకపోతే నిన్ను చంపి .

**జాగ్రాణి :** ఏటంటున్నావు.. ఇవి ఇవ్వకపోతే చంపేస్తావా... అంత వెర్రి బాగులదానిలా కన్పిస్తున్నానా... నా సంగతి నీకు తెలీదు..

**దొంగ :** ఏటే నువ్వు మాట్లాడేది... నీ సంగతి ఎవడికి కావాలే... ముందు ఆ నగ గట్రా యిస్తే మర్యాదగా వెళ్ళిపోతాను. యిత్తవా యివ్వా...

**జాగ్రాణి :** నేను యివ్వనురా... నువ్వెవ్వడివిరా నన్ను ఆడగడానికి....

దొంగ : యివ్వవా అంటూ చేయిపట్టుకొని లాగేస్తాడు

**జాగ్రాణి :** నీకే రోగమొచ్చిందిరా నా చేయి పట్టుకుంటావా...
నాశనమయి పోతావురా...

**దొంగ :** పట్టుకుంటేనే కోపమొచ్చేసిందా.. పట్టుకోవడమే కాదే. నువ్వుగాని ఆ బంగారం యివ్వకపోతే పళ్ళు కూడా రాలగొడుతాను... తెలిసిందా...

**జాగ్రాణి :** ఏటి నా పళ్ళు రాలగొడతావా... నువ్వు మనిషి పుట్టక పుట్టలేద్రా... యిలా తేరగా వచ్చి, ఆడవాళ్ళను బెదిరించి సొమ్ములు కాజేస్తావా..

**దొంగ :** ముసలిదానా... నన్ను తిట్టేవంటే సంపేస్తాను. నేను ఎవరనుకున్నావు... దొంగను. మహాదొంగను.. ముందు నీ ఒంటి మీదున్న ఆ ఎండి, బంగారు నగలు యిచ్చేయ్..

**జాగ్రాణి :** నేను యివ్వనుగాక యివ్వను... అయినా నీకు సిగ్గులేద్రా... కష్టపడి సంపాదించుకోకుండా మాలాటోళ్ళ దగ్గర దోచుకొని బతుకుతావా... నాలాంటి వాళ్ళను బాధపెడితే నీకు పుట్టగతులుండవురా...

**దొంగ :** ఏటే ముసలిదానా... లొడ లొడమని ఏటి కూత్తున్నావు అంటూ (బరబరమని ఈడ్చుకొని కింద పడేస్తాడు) నీకే అంత పొగరుంటే నా కెంతుండాలే... యిప్పటికైనా ఆ మెడలో వున్నవి గబగబా యిచ్చేయ్. నేకపోతే నేను మనిషినికాదు...

**జాగ్రాణి :** నువ్వు మనిషివి కాదురా... మృగానివి... పశువ్వి.... కాబట్టే యిలా చేస్తున్నావు...

**దొంగ :** ముసలిదానా.. మర్యాదగా సెప్పుతున్నాను. అనవసరంగా పేణాలు పోకుండా నా సేతిలో సావకుండా నీ దగ్గరున్నది నాకిచ్చేయి. అయినా రేపో మాపో పోయే దానికి నీకెందుకే ఆటిపై ఆశ. పేణాలు పోతాయన్న యివ్వటం లేదు... ఏటి సూసుకొని ఇరగబడి పోతున్నావు.

**జాగ్రాణి :** ఒరేయ్ ముసలిదాని మీద కనికరం లేద్రా.. నన్నేందుకురా హింసిస్తున్నావు. అయినా యిలా బతకటానికి సిగ్గులేదురా... మాలాంటి ముసులోళ్ళమీద నీ ప్రతాపం.. నిన్ను ఆ దేవుడు కూడా క్షమించదురా...

**దొంగ :** నోరుమూయవే ముసలిదానా... నీతులు సెప్పుతున్నావు.. ఆ దేవుడు సమించకపోతే నాకేమి కాదుగాని ముందు నగలు యిత్తవా లేదా... యివ్వక పోయినావనుకో నిన్ను యిక్కడే సంపేత్తాను.. నేను అసలే దినకంత్రీనిగాడిని... అంటూ (ఆమెను అటు యిటు గుంజేతుంటాడు)

**జాగ్రాణి :** (తనను వీడు చంపేస్తాడని అనుకొని అప్పుడు) మెహెర్‌బాబా రక్షించవా.. ఈ ముదనష్టపోడు నా ప్రాణాలు తీసేస్తున్నాడు... నన్ను రక్షించు...

**దొంగ :** హే ముసిలిదానా... నువ్వు అరిస్తే యిక్కడకు ఎవడు రాడు... నువ్వు ఎంత గింజుకున్న నిన్ను ఎవడూ కాపాడలేదు... అంటూ (బరబరమని లాకెళ్ళిపోతుంటాడు)

జాగ్రాణి : మెహెర్‌బాబా రక్షించవా... నువ్వు నిజంగా దేవుడవే... నిన్ను నమ్ముతున్నాను నన్ను కాపాడు...

దొంగ : ఏటి మెహెర్‌బాబా... నిన్ను కాపాడుతాడా.. ఏ దేవుడు నిన్ను కాపాడలేదే ముసలిదానా.. యిదిగో నిన్ను గుద్దెత్తాను. అసలే నాకు కోపమెక్కువ.. సిరాకు రానీయకు... సంపేతాన్ను.. నగలు యిత్తావ యివ్వా..

జాగ్రాణి : మెహెర్‌బాబా! ఆపద్భాందవా.. ఈ దీనురాలిపై కరుణ చూపవా... నువ్వు ఆదుకుంటావని నిన్ను వేడుకుంటున్నాను. నా కొడుకుకు నీపైనున్న భక్తి నిజమయితే నన్ను కాపాడు...

దొంగ : హా.. హా.. ముసలిదానా.. నువ్వు ఎంత గొంతు చించుకొని అరచినా యిక్కడకు ఎవరు రారు. ఏ దేవుడు నిన్ను కాపాడలేడు. అయినా నీ అరుపులు ఎవరికి వినబడతాయి. ఎవరికి వినబడవు...

జాగ్రాణి : మెహెర్‌బాబా రక్షించు... నిన్ను దేవునిగా కొలుచుకుంటాను. నిన్నే నమ్ముకుంటాను. నా మొర ఆలకించి నన్ను రక్షించు...

దొంగ : హే ముసలిదానా నీ మొర ఆలకించడానికి ఇక్కడెవ్వరూ లేరు. నిన్ను చంపి నీ నగలు తీసుకుపోతాను... నిన్ను ఎవరు వచ్చి రక్షిస్తారో చూస్తాను.

జాగ్రాణి : హే భగవంతుడా.... హే జగద్రక్షకా... హే మెహెర్‌బాబా నన్ను రక్షించు. నా ప్రాణాలు నిలబెట్టు.. నేను వీడి బాధలను భరించలేకపోతున్నాను అంటూ (ఎంత గట్టిగా కేక వేయగలరో అంతగట్టిగా హృదయపు లోతుల నుండి) బాబా.. బాబా.. రక్షించు... రక్షించు అని అరుస్తూనే వుంటుంది. ఇంతలో ఎక్కడ నుండో వచ్చినావో రెండు తెల్ల ఆవులు దూసుకుని వచ్చాయి. ఆ ఆవులు కోపంతో రంకెవేస్తూ, కాలుతో దువ్వుతూ, కొమ్ములతో ఆ దొంగను పొడవసాగాయి. ఆ దొంగ చేతిలోనున్న కర్రతో వాటిని కొట్టసాగాడు. కానీ అవి తప్పించుకుంటూ మళ్లీ ఆ దొంగ మీదకు వెళ్ళాయి. ఆ రెండు ఆవులు తనను కుమ్మడానికి వస్తుంటే వాటి నుండి తప్పించుకోలేక కింద మీద పడుతూ...

దొంగ : యిదేటట ఈ ముసలిదాని గోల. ఆ దేవుడు ఆలకించేసాడేటి.. ఈ ఆవులు ఎక్కడి నుండి వచ్చేసాయి. వచ్చిన కానించి ఈ ఆవులు రెండూ నా మీద కుమ్మేత్తున్నాయి. ఆయే... ఆయ్... నన్ను సంపకండి... అమ్మా .. అమ్మా... నన్ను సమించమ్మా... తప్పయి పోయింది.

నిన్ను ఏ దేవుడు కాపాడినాడో.. ఆ ఆవులను ఆగమని చెప్పవమ్మా... నేను పారిపోతాను అంటూ వెళ్ళిపోతాడు.. ఆ రెండు తెల్ల ఆవులు జాగ్రాణి కాపలాదారులుగా చేరోవైపున వుండి ఆవిడను యింటివరకు తోడుగా వచ్చాయి.

జాగ్రాణి : బాబూరామ్... బాబూరామ్...

బాబూరామ్: ఏమయిందమ్మా... అలా ఉన్నావేటి

జాగ్రాణి : నాయనా బాబూరామ్.. నువ్వు చెప్పినట్లు బాబా నిజంగా దేవుడురా... ఈ రోజు యిలా బతికి వున్నానంటే ఆయన చలవేరా...

బాబూరామ్: ఏమి జరిగిందమ్మా...

జాగ్రాణి : ఈ రోజు గడ్డి కోస్తుండగా ఒక దొంగ నా దగ్గరకు వచ్చి నగలు యిమ్మని, అవి యివ్వకపోతే చెంపేస్తానని అన్నాడురా.. అన్నంత పనే చేయబోయాడు. ఆ దొంగ చేతిలో నా ప్రాణాలు పోవలిసిందిరా . బాబాయే నన్ను కాపాడారు. బాబా నామాన్ని గొంతెత్తి పిలవగానే రెండు తెల్ల ఆవులను పంపించి ఆ దొంగబారి నుండి నన్ను రక్షించాడురా... రక్షించాడు. నాయనా! బయట రెండు తెల్ల ఆవులు ఉన్నాయిరా.. అవే నన్ను రక్షించాయిరా... బయటకెళ్ళి చూడు.

(బాబూరామ్ బయటకెళ్ళి చూస్తే ఆ రెండు తెల్ల ఆవులు ఉండవు)

బాబూరామ్: అమ్మా! బయట ఏ ఆవులు లేవమ్మా...

జాగ్రాణి : ఆ రెండు తెల్ల ఆవులు లేవా..అవేరా నన్ను యిక్కడ వరకు దిగబెట్టాయి.. యిదంతా బాబా మహిమేరా.. ఓ గోమాతలారా! మీరు వచ్చి నా ప్రాణాలు కాపాడారు. ఆపద్భాంధవుడైన మెహెర్‌బాబా మిమ్మల్ని సృష్టించి మీ ద్వారా నా ప్రాణాలను కాపాడారు.. హే మెహెర్ ప్రభు... నీవే మా యిలవేల్పువి... మా హృదయ నివాసివి... బాబూరామ్ మనం అదృష్టవంతులం.. బాబా మన యిలవేల్పుగా దొరికాడు... అతడు మనకు సర్వాంతర్యామి...బాబూరామ్: అవునమ్మా అతనే మన సర్వాంతర్యామి...

**-తెరవేయబడును-**

## కొల్లి రామారావు

ఇలా తెలియజేస్తున్నారు. కోవిడ్ మహమ్మారిని ఎదుర్కొనేలా ప్రియతమ మెహెరుడిని ప్రార్థిస్తూ గత 210 రోజులుగా తాము నిర్వహిస్తున్న నిరంతర నామస్మరణ కార్యక్రమాన్ని 2020 అక్టోబరు 10 నుండి విరమిస్తున్నట్లు తెలిపారు. సుమారు 150 మందికి పైగా 24 **X** 7 బాబా నామస్మరణలో పాల్గొన్నారని ఆయన అన్నారు.

# మెహెరాబాద్
# తెలుగు-గుజరాతీల సహవాస్

**1958 ఫిబ్రవరి 21 నుండి 26 వరకూ**

**(గత సంచిక తరువాయి)**

పశ్చిమ బెంగాల్ నుండి వచ్చిన సహవాసీలు కొందరు బాబాను కోల్‌కత్తాకు రావల్సిందిగా ఆహ్వానించారు. అక్కడున్న సద్గురు రామకృష్ణ అనుయాయుల్ని ఆశీర్వదించాల్సిందిగా వారు బాబాను కోరారు. నేను అక్కడ కోల్‌కత్తాలో వున్నాను. మరలా రమ్మనమని అడుగుతారేమిటి? అని ప్రశ్నించారు సహవాసీలను బాబా. నేను అన్నింటా, అందరిలో వున్నానన్నారు. మీ ద్వారా మాట్లాడుతున్నాను. మీ ద్వారా నేను అన్నీ ఆలకిస్తున్నానన్నారు. నేను ఫలానా చోటకు వెళ్ళడం? వెళ్ళకపోవడం అంత ప్రధానం కాదని బాబా స్పష్టం చేశారు.

సహవాసీలలో ఒకరు బాబాను దర్శనం చేసుకునేందుకై వచ్చి, ముందుగా తనతో తీసుకువచ్చిన బాబావారి ఫోటోని బాబాకు బహుమతిగా ఇచ్చాడు. బాబా ఆ ఫోటోని తన నుదిటికి తాకించి, తిరిగి ఆతనికిచ్చేశారు.

ఆ పిదప బాబా దర్శనార్థం క్యూలో వచ్చిన హరిభాయి పటేల్‌ని సహవాసీలకు పరిచయం చేస్తూ ఈతను నన్ను ఎంతగానో ప్రేమిస్తాడన్నారు. గుజరాత్‌లోని బాజ్వా ప్రాంతం నుండి హరిభాయ్ వచ్చాడన్నారు. ఈతను గుజరాతీ భాషలో బాబాను పొగుడ్తూ ఎన్నో గీతాలు రాసాడని అన్నారు.

అప్పుడు సాయంత్రం 4 గంటలు కావస్తోంది.

మైక్‌లో ఒక అనౌన్స్‌మెంట్ చేయించారు.

ఎవరైతే బాబాను దర్శించుకున్నారో వారందరూ వెళ్ళి సమావేశహాల్లో కూర్చోవాలన్నారు. మరి కొద్దిసేపట్లో బాబా అక్కడకు వస్తారు.

ఆ పిదప ఆరతి ఆలాపన, అనంతరం మెహెర్‌బాబా మెహెరాజాద్‌కు బయల్దేరతారు. తిరిగి రేపు ఉదయం మెహెరాబాద్‌కి వస్తారని మైక్‌లో ప్రకటించారు.

బాబా అన్నారు కదా – తనకి ఆరోగ్యం బాగా లేదు.

రేపు కనుక జ్వరం వస్తే రోబోయే రోజుల్లో ఇక్కడ జరుగుతున్న సహవాస్‌కి హాజరవ్వడం కష్టమౌతుంది. కాబట్టి ఈ రోజు తాను పడిన శ్రమ నుండి విశ్రాంతి తీసుకోవడానికై మెహెరాజాద్‌కి త్వరలో వెళ్ళనీయండన్నారు.

రేపటి నుండి తాను పిలిస్తే తప్ప వేదికపైకి రాకూడదన్నారు.
అలాగే ప్రత్యేక ఇంటర్వ్యూలు, లేదా తనను కలిసి మాట్లాడే ప్రయత్నం వద్దన్నారు.
ఈ నెల 25న, తిరిగి మీ స్వస్థలాలకు వెళ్ళే ముందర మాత్రమే నా దర్శనం,
పాదస్పర్శ ఇస్తానన్నారు. ఐతే ఆ రోజు ఆలింగనం అడగవద్దన్నారు.
ఆ పిదప, ఓ ఇద్దరు సహవాసీలను చూసి, వీరిని నేను తప్ప మరొకరు మీకు
పరిచయం చేయలేరన్నారు. వీరిద్దరూ నన్ను అమితంగా ప్రేమిస్తారన్నారు.
వీరు గుస్తాద్‌జీ సోదరులు. హెూమీ, సాల్మన్‌లు వారి పేర్లు అని సహవాసీలకు బాబా
పరిచయం చేశారు. గోదావరి జిల్లా నుండి సహవాస్‌లో పాల్గొన్న
మల్లిఖార్జునరావు తాను తెలుగులో సంకలనం చేసిన రెండు కొత్త పుస్తకాలను
బాబాకు అందజేశాడు. ఆ పిదప క్యూలో నిల్చున్న కోడూరి క్రిష్ణారావు, కొవ్వూరు
బాబా ..బాబా..బాబా..అని నెమ్మదిగా నామస్మరణ చేస్తూ
బాబా ఎదుటకు దర్శనార్థం వచ్చారు. నాయందు ఈతని ప్రేమ చాలా ప్రత్యేకమైందని
బాబా ప్రకటించారు. ఆనాడు తెలుగు ప్రాంతం నుండి వెళ్ళిన నలుగురు ప్రధాన
కార్యకర్తలైన డాక్టర్ ధనపతిరావ్ నాయుడు, కుటుంబశాస్త్రి, రంగారావు,
మల్లిఖార్జునరావ్‌లను ఉద్దేశించి మాట్లాడుతూ “కుటుంబశాస్త్రి
చాలా నమ్మకస్తుడైనవాడని” అన్నారు. మిగిలినవారిని కలిసేందుకు ముందుగా,
మీ నలుగురినీ ఒకేసారి, అంటే ఒకే సమయంలో ఇక్కడ కలవాలనుకుంటున్నానన్నారు
బాబా. మీ నలుగురినీ చూడటం తనకు చాలా సంతోషంగా వుందని,
తిరిగి వారికి బాబా ఆలింగనం ఇచ్చారు. తెలుగునాట వీరు చాలా పెద్ద కార్యకర్తలని,
సహవాసీలందరికీ పరిచయం చేశారు బాబా. ఆ తర్వాత క్యూలో వచ్చిన ఏరుచ్
మేనమామ మెహెర్జీ సాతాను చూసి, ఈయన చాలా ప్రత్యేకం అన్నారు.
తన సమయాన్నంతా బాబా నామస్మరణలో, బాబానామవ్యాప్తిలో అహరహం కృషి
చేస్తాడని పరిచయం చేశారు. బాధల్లో వున్నవారికి అవసరమైన సహాయం చేయడానికి
ఎప్పుడూ సిద్దంగా వుంటాడాయన. చాలా పవిత్రమైన మనస్సు.
నా నిజదర్శనం క్షణకాలం ఆయనకు ఇవ్వాలనుకుంటున్నాను.
అంతర్గతంగా లభించే ఓ అనుభూతిలాంటిది కాదు. నా నిజస్థితి దర్శన భాగ్యం
ఇవ్వాలనుకుంటున్నానని బాబా సహవాసీలందరి ఎదుట ప్రకటించారు.
ఆ తర్వాత క్యూలో వచ్చిన మెహెర్‌వాన్ జెస్సావాలా, ఏరుచ్ తమ్ముడ్ని వుద్దేశించి,
నఖశిఖపర్యంతం ఈతను నావాడన్నారు. అసలు సిసలైన అమూల్యమైన ఆభరణం
మెహెర్వాన్ అని బాబా పరిచయం చేశారు. కాకినాడ నుండి హాజరైన
ఏడిద సత్తిరాజు గారిని చూసి, నా నామవ్యాప్తికి నీవెంత కష్టపడుతున్నావో
నాకు తెలుసు అన్నారు. సహవాసీలలో ఒకరు బాబావారి ఆలింగనం కోసం

రెండవసారి క్యూలో నిల్చోవడం చూసిన బాబా, ఇంకా చాలామంది మొదటిసారి కూడా పూర్తికాలేదని మెత్తగా హెచ్చరించారు. ఉపాసనీ మహారాజ్ మేనల్లుడు క్యూలో రావడం చూసి, ఈతను నన్ను ఎంతగానో ప్రేమిస్తాడు. నేనూ ఆతడ్ని అమితంగా ప్రేమిస్తానన్నారు. ఆంధ్రా నుండి సహవాస్‌కి ఇద్దరు సోదరులు బాలగోపాల రామభద్రరాజు, బాలగోపాల భాస్కరరాజు హాజరయ్యారు. వీరిని పరిచయం చేస్తూ నా ఎడల వీరికి ఎంతో ఆరాధన వుంది. హృదయపు లోతుల నుండి వారు నన్ను ఎంతగానో ఆరాధిస్తారని బాబా పరిచయం చేశారు. వారు నన్నెంతగా ప్రేమిస్తారో మీకు తెలియదన్నారు. గాడ్ స్పీక్స్‌కి సంబంధించి ఓ చక్కని చార్టు తయారుచేసి దాన్ని నా పాదాల దగ్గర వుంచారు. ఆ చార్టు చాలా బాగుంది. అది నాకెంతో నచ్చింది. ఆ చార్టుని మెహెరాబాద్ మండలిహాలులో గోడకు అందరూ చూసేలా గోడకు వ్రేలాడదీయమని చెప్పానన్నారు బాబా. గత కొన్ని సంవత్సరాలుగా ఈ సోదరులిద్దరూ నా నామవ్యాప్తి కోసం విశేష కృషి చేస్తున్నారు. ఆంధ్రా ప్రాంతంలో నా గురించి పదిమందికి తెలిసేలా చక్కని బుర్రకథను రూపొందించి, దాన్ని పల్లెల్లో, పట్టణాల్లో ప్రదర్శిస్తున్నారు. ఇప్పటిదాకా వారు ఈ బుర్రకథను 99 సార్లు ప్రదర్శించారు. ఆ బుర్రకథను ఇక్కడ మెహెరాబాద్‌లో ఫిబ్రవరి 25న నా సమక్షంలో ప్రదర్శించేందుకు అనుమతించమని కోరారు. నేను చాలా సంతోషంగా అనుమతించానని, బాబా బాలగోపాల సోదరుల గురించి ప్రశంశాపూర్వకంగా సహవాసీలకు పరిచయం చేశారు.*

తమిళనాడులోని విరుద్ధనగర్ నుండి హాజరవుతున్న రాజా మొహమ్మద్ ఆయన భార్యని ఉద్దేశించి ఈయన మద్రాసులో కొంతకాలం డెప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసుగా వున్నారు. స్వచ్ఛమైన ముస్లిం. ఆ తర్వాత పాండిచ్చేరిలో ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసుగా పనిచేశాడు. నన్నెంతగానో ప్రేమిస్తాడు. ఆయన భార్య కూడా నా భక్తురాలు. వారి అనుభవాలను వివరిస్తూ ఒక చక్కని పుస్తకాన్ని రాశారు. ఆ పుస్తకాన్ని నా కార్యదర్శి ఆదీ కె ఇరానీకి ఇచ్చారు. మీలో ఎవరికైనా వీలుంటే ఆ గ్రంధాన్ని చదనవమన్నారు బాబా. ఆ తర్వాత ఏలూరు నుండి హాజరైన డాక్టర్ కనకదండి సూర్యనారాయణకు బాబా తన ఆలింగనం ఇచ్చారు. డాక్టర్ కనకదండి అన్నింటా అంటే ఓ వైద్యునిగా, వంటవాడిగా, సేవకుడు, ప్రేమికుడూ ఇలా ఆతను అన్నింటితో కలిసి మెలిసిన ప్రేమికుడని కనకదండిని బాబా ప్రశంశించారు. ఆ రోజు సాయంత్రం 5 గంటలకు గ్లాసులో మంచినీళ్ళు త్రాగుతుంటే బాబా గొంతులో పొలమారుతుంది. చిన్న దగ్గుతెర వచ్చింది. గతవారంలో జరిగిన సహవాస్‌లో కూడా ఇదే సమయానికి నా గొంతులో పొలమారిందని బాబా గుర్తుచేశారు. నన్ను ఎవరైనా తలుచుకుంటున్నారా? అని ప్రశ్నించారు.

ఇదే ప్రశ్నని గతవారం జరిగిన సహవాసీలను అడిగితే ఎవరూ జవాబు చెప్పలేకపోయారని ప్రక్కనే వున్న ఏరుచ్ జ్ఞాపకం చేశాడు. ఇది మాయ ప్రభావం అని బాబా అన్నారు. ....

## * సందర్భోచితం

**ఆధ్యాత్మిక చింతనాపరులందరి కోసం అవతారుడు అందించిన గొప్ప గ్రంధం "గాడ్ స్పీక్స్". ఈ ఉద్గ్రంథంలో ఎన్నో ఆధ్యాత్మిక రహస్యాలు బాబా వెల్లడించారు. ఐతే ఇంగ్లీషులో వున్న ఈ గ్రంధం అందరికీ అర్థంకాదని చెప్పొచ్చు. అందుకోసమని, ఈ గ్రంధానికి సంబంధించి చక్కని వ్యాఖ్యానంగా, సామాన్యులకు కూడా సులువుగా అర్థమయ్యేలా, చిత్రకళాకారులైన బాలగోపాల సోదరులు ఆ గ్రంధంలో గల ప్రతి చాప్టర్‌కు రేఖా చిత్రాలతో చార్టులను రూపొందించి అవతారుని పాదపద్మాలకు మెహెరాబాద్ సహవాస్‌లో అంకితం చేశారు. ఈ చార్టుల సహాయంతో అవతారుని ఎదుట భగవద్వచనాన్ని సరళమైన రీతిలో వివరించారు. అనంతరం, శ్రీ భాస్కరరాజు మనదేశంలోని అనేక బాబా కేంద్రాలలో, అలాగే పశ్చిమాన అమెరికాలోని పలు బాబా కేంద్రాలలో ఈ చార్టు సహాయంతో భగవద్వచనాన్ని తెలియజేసే కృషి చేశారు. 2000 సంవత్సరం ప్రథమార్థంలో ఆయన హైదరాబాద్‌లోని కోఠి సెంటర్‌లో వారం రోజులపాటు ఈ చార్టుల సహాయంతో భగవద్వచనాన్ని సరళమైన రీతిలో వివరించారు. హైదరాబాద్‌లోని ప్రేమికులు సుమారు నూరు మంది ప్రతి రోజూ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. తాను రూపొందించిన ఈ భగవద్వచనం చార్టులు అవతారుడు ఆమోదించాడని, తాను సహవాసీలకు భగవద్వచనం వివరించిన తీరును బాబా ప్రశంశించారని ఆ సందర్భంలో శ్రీ భాస్కరరాజు గుర్తుచేసుకున్నారు. కొసమెరుపు ఏమంటే, ఎవరు ఏమి చెప్పినా నమ్మలేని రోజులివి. స్వయంగా చూడాలి లేదా వినాలి.**

**సత్యం – అసత్యం నడుమ తేడా చాలా సన్నబడిపోతున్న రోజుల్లో భాస్కరరాజు గారి మాటలు ఎందరు విశ్వశించారో!! ఆనాడు కోఠిలో భాస్కరరాజు గారు నిర్వహించిన భగవద్వచనం తరగతుల వల్ల చాలామంది లాభించారు. ఆ కార్యక్రమం ప్రారంభం – ముగింపులకు మాత్రమే హాజరుకాగల్గిన మాబోటి వారికి గాడ్‌స్పీక్స్ అంటే నేటికీ కఠినమైన అంశమే!! – (అనువాదకుని వ్యక్తిగత అభిప్రాయం).**

**అవతారుని దివ్య సంభాషణా చాతుర్యం మెహెరాబాద్ సహవాస్ శీర్షికలో కనపడుతుంది. ఆసాంతం చదవండి! చదివించండి!!**

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మ**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము. మరియు చిట్టచివరి వరకు బాబా కొంగును దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

# జీవిత సభ్యత్వం

**మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు**
శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
**SB A/C NO: 173201000029152, IFSC CODE: IOBA 0001732.**

**మెహెర్‌బాబా పత్రిక వార్షిక సభ్యత్వం రూ. 100/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు**
శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
**SB A/C NO: 173201000027973, IFSC CODE: IOBA 0001732.**

సభ్యత్వం పోస్టులో మనీ ఆర్డర్, బ్యాంకు చెక్కు, లేదా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా పంపగోరువారు ఈ క్రింది పోస్టలు అడ్రస్సుకు పంపవల్సింది.

## మా అడ్రస్:

ఎడిటర్, మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్,
బాబాస్ హౌస్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్ కాలనీ పోస్టు,
సికింద్రాబాద్-500087.
ఫోన్: 99595-53218.
**email: malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.
**Editor: D. Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: HSE/789/2020-2022 **Dt.20-01-2020,** Date of Publication 20h of every month, Posted at Patrika Channel on 25 / 26th every month.